PDF Compressor Free Version

Licensed to post without Prepayment No. J/Nellore/003/12-14 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03

నెల్లూరు, 22.03.2013, శుక్రవారం సంపుటి : 32 సంచిక : 42 పేజీలు : 12, వెల : ₹ 4

24గం॥ చిన్నపిల్లల స్పెషలిస్టులచే వైద్యం చేయు ఏకైక చిన్నపిల్లల సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్


నెలలు తక్కువ బిడ్డా ? సంరక్షణ కొరకు...

పుట్టిన పిల్లల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (NICU)

Dr. T. Ravikumar's

రిచ్ హాస్పిటల్

రవి చిన్నపిల్లల హాస్పిటల్



లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

www.lawyerteluguweekly.com

# ప్రమాదం అంచున ప్రభుత్వం







డీఎంకె మద్దతు ఉపసంహరణతో యూపీఏ ప్రమాదంలో పడింది. ములాయం, మాయవతిలే ఇక మన్మోహన్ సర్కార్‌ను కాపాడాలి.

జనతా సర్కార్... నేషనల్ ఫ్రంట్... యూనైటెడ్ ఫ్రంట్... ఎన్డీఏ... యూపీఏ... దేశంలో సంకీర్ణ ప్రభుత్వాల శకానికి ఆనవాళ్ళు. ఇప్పటివరకు యూపీఏ తప్పితే మిగతా కూటములన్నీ నిర్ణీత కాలం పూర్తి కాకుండా మధ్యలో కూలినవే! ఒక పర్యాయం పూర్తి పదవీకాలాన్ని అనుభవించిన ప్రస్తుత యూపీఏ సర్కార్ మాత్రం ఇప్పుడు ప్రమాదంలో పడింది. ఈరోజా... రేపా అన్నట్లు పరిస్థితి మారింది.

కేంద్రంలోని యూపీఏ ప్రభుత్వానికి మిత్రపక్షమైన డీఎంకె మద్దతు ఉపసంహరించుకుంది. ఆ పార్టీకి చెందిన ౯మంది కేంద్రమంత్రులు కూడా రాజీనామాలు చేసారు. శ్రీలంక తమిళుల అంశంపై కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరికి నిరసనగానే డీఎంకె మద్దతు ఉపసంహరించినప్పటికి, దీని అంతరార్థం వేరేగా వుంది. యూపీఏ ప్రభుత్వం పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత వుంది. రేపు ఎన్నికలలో కాంగ్రెస్‌తో కలిసి పనిచేస్తే ఆ ప్రభావం తమపై కూడా పడుతుందని డీఎంకె భయం. అందుకే ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. తమిళుల మద్దతు కూడగట్టేందుకు శ్రీలంక తమిళుల అస్త్రాన్ని ప్రయోగించింది. ఈ సాకుతో యూపీఏ నుండి బయటకు వచ్చింది. దీనికి ప్రతీకార చర్యలను కూడా కాంగ్రెస్ వెంటనే చేపట్టింది. కరుణానిధి కుమారుడు స్టాలిన్ ఇళ్ళపై గురువారం సిబిఐ విస్తృతంగా దాడులు నిర్వహించింది. 33 విదేశీకార్లు ఆయనకు వున్నట్లు గుర్తించి, వాటిలో 13కార్లను స్వాధీనం చేసుకుంది. వీటి మొత్తానికి 38కోట్లు పన్ను ఎగ్గొట్టినట్లుగా స్టాలిన్‌పై అభియోగం మోపింది. దీంతో జాతీయ రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. సిబిఐ అంటే కాంగ్రెస్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో అని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను ఈ దాడుల ద్వారా నిజం చేసినట్లైంది. అయితే డీఎంకె యూపీఏ నుండి వైదొలిగినా, ఎన్డీఏ వైపు వెళ్లే అవకాశాలు లేవు.

(మిగతా 5వ పేజీలో)

# అంబరాన్నంటిన అభిమానం

## అందరివాడికి ఆత్మీయఅవార్డు ప్రదానం



ప్రజాబంధు జె.కె.రెడ్డికి "జీవిత సాఫల్య పురస్కారం" అందజేస్తున్న అతిథులు

రైతుగా, కాంట్రాక్టర్‌గా, సంఘ సేవకుడిగా, రాజకీయవేత్తగా అన్నింటికీమించి అజాతశత్రువుగా నెల్లూరుజిల్లా ప్రజల అభిమానాన్ని చూరగొన్న మాజీ శాసనసభ్యుడు జె.కె.రెడ్డి తన 72వ వడిలో "జీవితసాఫల్య పురస్కారాన్ని" అందుకున్నారు. తాను పనిచేసిన అన్ని రంగాలలోను మంచి పేరుతో పాటు తనకోసం తపించే అభిమానులను సైతం సొంతం చేసుకొన్న ధన్యజీవి జె.కె.రెడ్డి. సహజంగా రాజకీయనేతలకు పదవులు వుంటే జనం వేలల్లో ఇంటి ముందుంటారు, అదే పదవి వూడితే వేళ్ళల్లో వుంటారు. అయితే జె.కె.రెడ్డి పదవిలో వున్నా లేకున్నా ఎప్పుడూ ఆయన ఇల్లు జనంతో కళకళలాడుతూనే వుంటుంది. ఇది జె.కె.రెడ్డిలోని గొప్పదనం. ఎవరొచ్చినా ఎదురొచ్చి నవ్వుతూ పలకరించే ఆత్మీయగుణం.

గత కొంతకాలంగా రాజకీయాలకు దూరంగా, ఇటీవల కాలంలో వై.యస్.ఆర్. కాంగ్రెస్ పార్టీకి దగ్గరగా వుంటున్న జె.కె.రెడ్డిని "హరివిల్లు క్రియేషన్స్" లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది. మార్చి 17వ తేదీ ఆదివారం సాయంత్రం నెల్లూరు టౌన్‌హాల్ ఆరుబయట ప్రత్యేకంగా నిర్మించిన వేదిక పైన ఈ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం ఆడంబరంగా జరిగింది. 6గంటల నుండి జరిగిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల అనంతరం 9గంటలకు ప్రారంభమైన సత్కార కార్యక్రమం 10గంటలా 35నిముషాలకు ముగిసింది. టౌన్‌హాల్ ప్రాంగణం మొత్తం జె.కె.రెడ్డి అభిమానులతో నిండిపోయింది. చాలాకాలం తర్వాత తమ ప్రియతమ నేతను సత్కరించుకనే భాగ్యం లభించడంతో అభిమానులు వందల సంఖ్యలో పూలమాలలు, శాలువాలతో తరలివచ్చారు.

(మిగతా 7వ పేజీలో)

# ఇక కె.వి.పి...!

## జగన్ కేసు మూలాల కోసం సిబిఐ సర్చ్..!



**రాజకీయాలలో కుటిలనీతికి, కుట్రలకు, నమ్మకద్రోహానికి నిలువెత్తు రూపం కె.వి.పి.రామచంద్రరావు. నమ్మిన చేయినే కొరికాడు. నమ్మి అందల మెక్కించిన మిత్రుడి కుటుంబం పట్లే విశ్వాసఘాతుకానికి పాల్పడ్డాడు.**

ఏ స్నేహితుడైతే స్నేహానికి విలువనిచ్చి అర్హతలేకున్నా అత్యున్నత పదవులు అప్పగించాడో, అదే స్నేహితుడిని తోటి కాంగ్రెస్ నాయకులు పరుషపదజాలంతో దూషిస్తున్నా నిమ్మకు నీరెత్తినట్లు వుండి పోయాడు. ఈ నమ్మక ద్రోహానికి, మిత్ర ద్రోహానికిగాను కెవిపికి తగిన శాస్తి జరగబోతుందా? ఈ ప్రశ్నకు త్వరలోనే సమాధానం లభించే అవకాశాలున్నాయి.

దివంగత మహానేత డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి ఆత్మగా కె.వి.పి.రామచంద్ర రావును చెబుతారు. వారిది 40ఏళ్లకు పైబడిన స్నేహం. గుల్బర్గా మెడికల్ కాలేజీలో మొదలైన వారి స్నేహబంధం 2009సెప్టెంబర్ 2వ తేదీ వై.యస్. హెలికాప్టర్ ప్రమాదంలో మరణించేంతవరకు కొనసాగింది. కాని ఆ తర్వాత ఏమైంది?

వై.యస్.కు స్నేహితుడైనందుకు కె.వి.పి రెండుసార్లు వై.యస్. ప్రభుత్వంలో ప్రభుత్వ సలహాదారుగా నియమించబడి క్యాబినెట్ మంత్రి హోదాను అనుభవించాడు. ఆయన పుణ్యానే పంచాయితీవార్డు మెంబర్‌కు కూడా తక్కువైన కె.వి.పి రాజ్యసభ సభ్యుడు కాగలిగాడు. వై.యస్. పాలనలో కెవిపి అత్యున్నత స్థాయి గౌరవం పొందారు.

కాని దీనికి ప్రతిఫలంగా కెవిపి తన మిత్రుడు వైయస్.కు ఏమిచ్చాడు? అపకీర్తి, అవినీతి ఆరోపణలు మూటగట్టి ఇచ్చాడు. వై.యస్. పాలనలో కెవిపి చాటుమాటుగా ఎన్నో అవినీతి కార్యకలాపాలు సాగించాడు. ఆయన దృష్టికి పోకుండానే ఎన్నో అక్రమాలు చేయించాడు. వీటికి ఫలితంగానే కొందరు ఐఏఎస్ అధికారులు సైతం జైళ్లలో వున్నారు.

(మిగతా 5వ పేజీలో)

END OF SEASON SALE

FLAT 25% Off
శారీస్, గాగ్రాస్, సల్వార్స్, డ్రస్ మెటీరియల్స్ లపై

FLAT 20% Off
లేడీస్ వెస్టన్ వేర్, మెన్స్ వేర్ లపై

కళానికేతన్
షాపింగ్ మాల్
ట్రంక్ రోడ్, గాంధీనగర్, నెల్లూరు. ఫోన్ 2316677

PDF Compressor Free Version



# 'దేశం'కు రోజులు దగ్గరపడ్డాయి

**కాకాణి**



మహిళలకు వైయస్సార్సీ మేనిఫెస్టోను అందజేస్తున్న కాకాణి

వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కన్వీనర్ కాకాణి గోవర్ధన్‌రెడ్డి గడపగడపకు వైయస్సార్సీపీ నినాదంతో చేస్తున్న దీవెనయాత్ర ఈనెల 19న మనుబోలు మండలంలోని బండేపల్లి గ్రామంలో సాగింది. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేలా బడ్జెట్ వుండాలి కాని ఆర్థికశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను నిరాశపరిచేలా వుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది చివరి బడ్జెట్ అవుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు రెండునాల్కల ధోరణి మార్చుకోవాలని, కాంగ్రెస్‌తో కుమ్మక్కైన ప్రతిపక్షనేత చంద్రబాబు ఇది ప్రజాకంఠక బడ్జెట్ అని పేర్కొనడం హాస్యాస్పదంగా వుందని అన్నారు.

కార్యక్రమంలో పార్టీ నాయకులు పేర్నేటి శ్యాంప్రసాద్‌రెడ్డి, అడపాల వెంకటరమణయ్య, గుండ్రాల వజ్రమ్మ, పచ్చిపాల జయరామిరెడ్డి, చెందులూరు శ్రీనివాసులుయాదవ్, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, మొదలగువారు పాల్గొన్నారు. బండేపల్లి గ్రామంలో కాకాణికి మహిళలు దిష్టితీసి స్వాగతం పలుకగా కార్యకర్తలు, అభిమానులు గజమాలతో సత్కరించి ఆహ్వానించారు. మేళతాళాల మధ్య విశేషసంఖ్యలో కార్యకర్తలు వెంటరాగా కాకాణి దీవెనయాత్ర సాగింది.

### సరికొత్త ప్రకృతి చికిత్సాలయం

## శ్రుతీస్ నేచర్‌క్యూర్ సెంటర్



శ్రుతీస్ నేచర్‌క్యూర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

ప్రకృతి సిద్ధమైన చికిత్సా పద్ధతులచే చికిత్స అందిస్తూ, ప్రజలను పరిపూర్ణ ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో నెల్లూరు మాగుంటలేఅవుట్‌లోని కింగ్స్ కోర్టు అవెన్యూలో ఈనెల 18న "శ్రుతీస్ నేచర్‌క్యూర్ సెంటర్"ను నెలకొల్పారు. జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ప్రారంభించిన ఈ ప్రకృతి చికిత్సాలయంలో యోగా, ధ్యానం, ప్రాణాయామం, స్టీమ్‌బాత్, సోనాబాత్, హిప్ & స్పైనల్‌బాత్ తదితర పద్ధతుల ద్వారా చికిత్స అందిస్తారు. ఆరోగ్యకరమైన జీవన విధానం ద్వారా, ఆహారపు నియమాల ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందేలా శ్రుతీస్ నేచర్‌క్యూర్ సెంటర్‌లో చికిత్స వుంటుందని నిర్వాహకులు తెలిపారు. "బెస్ట్" వాటర్ ద్వారా శుద్ధమైన మంచినీటిని అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి ఈ సెంటర్‌ను నెల్లూరీయులకు అందుబాటులోకి తెచ్చారు.

## చదువులపై చిన్నచూపు



సమావేశంలో ప్రసంగిస్తున్న బీద రవిచంద్ర

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు బీద రవిచంద్ర పేర్కొన్నారు. 20వ తేదీ నెల్లూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన నెల్లూరు గ్రామీణ తెలుగునాడు విద్యార్థుల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యారంగానికి కేటాయించిన నిధులను చూస్తుంటేనే చదువుల పట్ల సర్కార్‌కు ఎంత చిత్తశుద్ధి వుందో అర్థమవుతుందన్నారు. ఏ రాష్ట్రంలోనూ ఇలాంటి పరిస్థితిలేదని పేర్కొన్నారు. విద్యారంగానికి 30శాతం నిధులను కేటాయించాలని విద్యార్థి సంఘాలు ఆందోళన చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం లెక్కలేనితనంగా వ్యవహరిస్తుందన్నారు. నిధులు లేక జిల్లాలో చాలా హాస్టళ్లు మూతపడుతున్నాయని, పేద, మధ్యతరగతి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యార్థులకు ఈ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలపై పోరాడాలని ఆయన తెలుగునాడు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో తెలుగునాడు విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు కె.తిరుమలనాయుడు, ప్రధానకార్యదర్శి ఎస్.కె.అమ్మల్లా, జలదంకి సుధాకర్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

### అర్బన్ ప్రాంతాల్లో

## రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతాయి

రిజిస్ట్రార్ కార్యాలయాలలో మొన్నటి వరకు రద్దీలేకుండా వుండింది. ఇటీవల ఇబ్బడిముబ్బడిగా రిజిస్ట్రేషన్లు జరుగుతుండడంతో రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సందడి కనిపించింది. కారణం ఏప్రిల్ 1 నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు బాగా పెరగనుండడం. ఆ విషయాన్నే ఈనెల 19న జాయింట్ కలెక్టర్, మార్కెట్ వాల్యూరివిజన్ కమిటీ ఛైర్మన్ బి.లక్ష్మీకాంతం ప్రకటించారు. ఏప్రిల్ 1 నుంచి పెంచిన విలువలు అమల్లోకి వస్తాయని కలెక్టరేట్‌లోని తన ఛాంబర్లో జరిగిన రివిజన్ కమిటీ సమీక్షా సమావేశంలో వెల్లడించారు. ఇప్పటికే డ్రాఫ్ట్‌ను పబ్లిష్ చేసినట్టు, అర్బన్ ప్రాంతాల్లో మాత్రమే రిజిస్ట్రేషన్ చార్జీలు పెంచనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆర్డీఓ మాధవీలత, జిల్లా రిజిస్ట్రార్లు తదితరులు పాల్గొన్నారు.

## గూడూరుని అభివృద్ధి చేస్తా

**పనబాక కృష్ణయ్య**

ఈ మూడున్నరేళ్ళలో 150కోట్ల రూపాయల మేర ప్రభుత్వ నిధులతో పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టామని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పనబాక కృష్ణయ్య అన్నారు.

సోమవారం ఆయన గూడూరు ఆర్ అండ్ బి అధికారులతో కలసి చిల్లకూరు బైపాస్ సెంటర్ సమీపం నుండి సంగం సినిమాహాలు వరకు నిర్మిస్తున్న సిసిరోడ్డు నిర్మాణపనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా గూడూరు నియోజకవర్గం నుండి పోటీ చేసి ఓటమిపాలైనప్పటికీ నియోజకవర్గ అభివృద్ధి విషయంలో ఎటువంటి రాజీ లేకుండా పనులను చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం తూర్పు-పడమర గూడూరులను కలుపుతూ నిర్మిస్తున్న రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులను ఆర్ అండ్ బి శాఖది మాత్రమే జరుగుతున్నదని, త్వరలో రైల్వేట్రాక్ వద్ద కూడా పనులు చేపడతారన్నారు.

ఆర్ అండ్ బి డి.ఇ. రామారావు, చంద్రశేఖరరెడ్డి, బాబురెడ్డి, ఎల్లా శ్రీనివాసులురెడ్డి, మల్లిఖార్జునరెడ్డి, కె.మునిగిరీష్, దేగా సురేష్, ముత్యాలయ్య, జమళ్ళ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## కిషన్‌రెడ్డికి అభినందనలు

భారతీయ జనతాపార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి ఎంపికైన కిషన్‌రెడ్డిని జిల్లా బీజేపీ నాయకులు హైదరాబాద్‌లో ఆదివారం కలిసి శుభాభినందనలు తెలిపారు. బీజేపీ జాతీయనేత యం.వెంకయ్యనాయుడు సమక్షంలో రాష్ట్ర అధికార ప్రతినిధి సన్నపురెడ్డి సురేష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పి.సురేంద్రరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కందుకూరి సత్యనారాయణ, కాకుమాని విజయలక్ష్మి, నల్ల కామేశ్వరమ్మ, కర్నాటి ఆంజనేయరెడ్డి, కుడుముల సుధాకర్‌రెడ్డి తదితరులు కిషన్‌రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మ ఫర్నిచర్ మాల్
మినిబైపాస్‌రోడ్, నెల్లూరు.
• సరికొత్త, ప్రపంచస్థాయి మోడల్స్
• ఇంపోర్టెడ్ & ఇండియా ఫర్నిచర్
ఫైనాన్స్ సదుపాయము, ఆదివారం షాపు గలదు.

# ఆటగాళ్ళుగా మారిన ఇంజనీర్లు




ఉల్లాసంగా... ఉత్సాహంగా... క్రీడల్లో పాల్గొన్న ఇంజనీర్లు, వారి కుటుంబసభ్యులు

నెల్లూరు దర్గామిట్టలోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో ఈనెల 25న ది కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్, ఆర్కిటెక్ట్స్ అసోసియేషన్ తొలివార్షికోత్సవం సందర్భంగా స్పోర్ట్స్ మీట్ జరిగింది. ఇంజనీర్లలో సీనియర్స్, జూనియర్స్‌కు క్రికెట్ పోటీలు జరుగగా మ్యూజికల్ ఛైర్స్, బాస్కెట్‌బాల్, త్రోబాల్ పోటీలలో వారి కుటుంబసభ్యులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరాంబాబురావు, ప్రధాన కార్యదర్శి యం.విజయ్‌ప్రసాద్ ఈ క్రీడాపోటీలు విజయవంతంగా నిర్వహించారు.

## విద్యార్థులకు "అక్షద" ప్రోత్సాహం



విద్యార్థులకు స్టేషనరీ అందజేసిన బి.మనోహర్‌రెడ్డి, రమేష్‌బాబు

నెల్లూరు నవలాకులతోట, కొత్తూరులోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని 10వతరగతి విద్యార్థులకు ఈనెల 14న అక్షద ఫౌండేషన్ పరీక్షలు రాయడానికి ఉపయోగపడే ప్యాడ్, పెన్, పెన్సిల్ తదితర సామాగ్రిని పంపిణీ చేసింది. ఈ సందర్భంగా అక్షద ఫౌండేషన్ ఛైర్మన్ బి.మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల జీవితంలో అతి ముఖ్యమైన సర్టిఫికెట్ పొందబోతున్నారని, తల్లిదండ్రుల కలలను నెరవేర్చే మొదటి అవకాశం వారికి కలిగిందని దానిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు మండల విద్యాశాఖాధికారి సిహెచ్ రమేష్‌బాబు, కొత్తూరు జడ్పీ హైస్కూలు ప్రధానోపాధ్యాయిని అమూల్యదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ళను అటకెక్కించారు

**- చాడ వెంకటరెడ్డి**

ప్రకటనల్లో ఆట్టహాసంగా చూపే ఇందిరమ్మ ఇళ్ళను నూతన బడ్జెట్‌లో అటకెక్కించారని, ఎస్సీ, ఎస్టీకాలనీలలో మౌలిక సదుపాయాల కల్పన కూడా మూలపడిందని సిపిఐ మాజీ శాసనసభాపక్షనేత చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు.

ఈనెల 19న నెల్లూరు రైల్వేఫీడర్స్‌రోడ్డులోని సిపిఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థికశాఖామంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర ప్రజలను పీల్చి పిప్పి చేసే విధంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని పేర్కొన్నారు. బ్యాంకులు ఇచ్చే రుణాలను బడ్జెట్‌లో కలిపి వ్యవసాయానికి ప్రాధాన్యతనిచ్చామనడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టుగా వుందని అన్నారు. 1.76లక్షకోట్లు అప్పులో మునిగివున్న రాష్ట్ర ప్రభుత్వం మళ్ళీ 24వేల కోట్లు అప్పు తీసుకోనున్నట్టు చెప్పడం ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనమన్నారు. వితంతు, వికలాంగ, వృద్ధాప్య ఫించన్‌లకు నయాపైసా కేటాయించలేదని పేర్కొన్నారు. విద్యుత్తు పంపిణీలో ప్రజలపై 34వేలకోట్లు భారం మోపడానికి సిద్ధమైన ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈనెల 23 నుంచి హైదరాబాదులోని ఇందిరాపార్కు వద్ద వామపక్షపార్టీలు నిరవధిక నిరాహారదీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో దశరథరామయ్య, రామరాజు, అంకయ్య, పార్థసారథి పాల్గొన్నారు.

### కాలధర్మం

## డా॥ వి.యస్.రెడ్డి



నెల్లూరులోని విజయమహల్‌గేటు వద్ద వుంటున్న ప్రముఖ మానసిక వైద్యనిపుణులు డాక్టర్ వి.యస్.రెడ్డి ఈ నెల 18వ తేదీ సోమవారం కన్నుమూశారు. ఆయన వయస్సు 53 సంవత్సరాలు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె వున్నారు. ఆయన సతీమణి డా॥ ఇందిర రేడియాలజిస్ట్‌గా సేవలందిస్తున్నారు. డా॥ వి.యస్.రెడ్డి జిల్లాలో తొలి మానసిక వైద్యనిపుణుడుగా పేరుగాంచారు. అలాగే జిల్లా మానసిక వైద్యుల సంఘానికి అధ్యక్షులుగా కూడా బాధ్యతలు నిర్వహించారు. ఎందరో మానసిక రోగులకు ఆయన సాంత్వన చేకూర్చారు. వి.యస్.రెడ్డి అకాలమరణం పట్ల నగరంలోని వైద్యులు దిగ్భ్రాంతి చెందారు. వి.యస్.రెడ్డి మరణం పట్ల సంతాపం తెలుపుతూ వారి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

PDF Compressor Free Version



» ఈ బడ్జెట్...

# నెల్లూరుకు 'ఆనం'ద దాయకం



• ప్రభుత్వ వైద్యకళాశాలకు 362కోట్లు • నెల్లూరులో 150పడకల సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రి

**జిల్లాకు చెందిన ఆనం రామనారాయణరెడ్డి ఆర్థిక మంత్రి హోదాలో ముచ్చటగా మూడోసారి సోమవారం శాసనసభలో వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దివంగత నేత వై.యస్. హయాంలోనే వార్షికబడ్జెట్ లక్షకోట్లకు దాటింది కాబట్టి ఇక అది పెరగడమేకాని తగ్గడం అన్నది ఉండదు. కాబట్టి ఈ బడ్జెట్‌ను లక్షా 61వేల కోట్ల రూపాయలతో ఆయన రూపొందించడం జరిగింది. బడ్జెట్ రూపకల్పనలో ఆనం తనదైన ముద్రను ప్రదర్శించారు.**

ఈ సంవత్సరం వ్యవసాయ రంగానికి ప్రత్యేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలనుకున్నారుగాని చివరకు అది వ్యవసాయ కార్యాచరణ ప్రణాళికగా పేరు మార్చుకుంది. ఎన్నికలు ఏ క్షణంలో ముంచుకొస్తాయో తెలియని వాతావరణమున్న తరుణంలో ఓట్ల బ్యాంకులను దృష్టిలో పెట్టుకుని కులాలు, మతాల వారీగా బడ్జెట్‌ను తయారు చేయడంలో ఆనం విజయం సాధించాడనే చెప్పవచ్చు. ఎస్సీ, ఎస్టీల సబ్‌కోటాకు 12,251కోట్లను కేటాయించడమే దీనికి ఉదాహరణ. జలయజ్ఞం, సాగునీటి రంగాలకు, పలు సంక్షేమ పథకాలకు నిధుల కోత వేయడం జరిగింది.

జిల్లాకు సంబంధించినంత వరకు కొంచెం మేలుచేసే బడ్జెట్టే ఇది. నెల్లూరు ప్రభుత్వ వైద్యకళాశాలకు 362కోట్లు కేటాయించడమే కాక అదనంగా 150పడకల ఆసుపత్రిని కూడా మంజూరు చేయడం జరిగింది. ఇక స్వయంగా మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరుకు దండిగానే నిధులు కురిపించారు. సోమశిల హైలెవల్ కెనాల్‌ను ఈ బడ్జెట్‌లో చేర్చారు. కాకపోతే సోమశిల పూర్తి ఆయకట్టు సామర్థ్యం, సీతారాంసాగర్ రిజర్వాయర్ నిర్మాణం పనులను పట్టించుకోలేదు. ఆనం బడ్జెట్‌తో జిల్లాకు కొంతైనా ఆనందమే కలిగిందని చెప్పుకోవచ్చు.

# మండుతున్న ఎండ

## జనం నెత్తిన తాగునీటి ఎద్దడి బండ

*ఇంకో వారంలో మార్చిని కూడా దాటుకుంటాం. అంటే పూర్తిస్థాయి వేసవికాలంలోకి అడుగు పెట్టినట్లే! అయితే ఏప్రిల్, మే, జూన్‌నెలల్లో వాతావరణం ఎలా వుండబోతుందో మార్చిలోనే కాస్తున్న ఎండలు సంకేతాలనందిస్తున్నాయి. ఈసారి ఎండలు జనానికి పట్టపగలే చుక్కలు చూపించడం ఖాయం.*

భూమ్మీద మనిషి పాపాలు పెరగడమైతేనేమీ, ప్రకృతిని, పర్యావరణాన్ని నాశనం చేయడం వల్లనైతేనేమీ ఋతువులు మారాయి. కాలాలు మారాయి. ఎండాకాలంలో తుఫాన్‌లు, వర్షాకాలంలో ఎండలు కాస్తున్నాయి. ఇక చలికాలం ఒక నెల రోజులలోపునే కుచించుకుపోయింది. ఇంతకుముందు జడివాన పట్టిందంటే పదిరోజులన్నా వదిలేది కాదు. కాని ఇప్పుడు ఓవైపు వర్షం పడుతున్నా ఇంకోవైపు ఎండకాస్తుంటుంది. అంత వికృతంగా మారిపోయింది కాలం.

ఈ ఏడాది కూడా ఎండలు మండిపోయే అవకాశాలున్నాయి. ఎండాకాలం వస్తుందంటేనే ఎన్నో సమస్యలు. కరెంట్‌కోతలు వర్షాకాలంలోనే వున్నాయి కాబట్టి ఇక ఎండాకాలంలో ఎలాగూ తప్పవు. వేసవిలో ప్రధానసమస్య తాగునీటి ఎద్దడి. గత ఏడాది జిల్లాలో కనీస వర్షపాతం లేదు. నవంబర్ నెలలో అరకొర వర్షాలు మాత్రమే కురిసాయి. జిల్లాలో ప్రధాన నీటివనరులైన సోమశిల, కండ్లేరు రిజర్వాయర్‌లకు పూర్తి సామర్థ్యంలో నీళ్లు రాలేదు. అసలు పెన్నానది పారనే లేదు. ఇక జిల్లాలో ఎక్కడా చెరువులు, బావులు నిండిన దాఖలాలే లేవు.

వర్షాభావ పరిస్థితి ఇంత దారుణంగా వుంటే రేపు ఎండా కాలంలో నీటి ఎద్దడి రాకుండా వుంటుందా? ఇప్పటికే బావులు, బోర్లలో నీళ్లు అడుగంటాయి. నెల్లూరులోని పలు ప్రాంతాలలో బురదనీళ్లు తగులుతున్నాయి.

జిల్లాలో 16,858 మంచినీటి బోర్లు, 2901 పిడబ్ల్యూడి స్కీంలు, 30సమగ్ర మంచినీటి పథకాలు వున్నాయి. జడ్పీ, పంచాయితీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల పర్యవేక్షణలో ఇవి పని చేస్తుంటాయి. గ్రామాలలో పంచాయితీ పాలకవర్గాలు లేక పోవడంతో వీటిని పట్టించుకునే దిక్కు లేక చాలా పథకాలు నిరుపయోగంగా వున్నాయి. నిధులు లేవని చెప్పి అధికారులు కూడా వీటి మరమ్మత్తుల జోలికి పోవడం లేదు. రాబోయే కొన్నిరోజుల్లోనే జిల్లాలోని చాలాగ్రామాలలో తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశాలున్నాయి.

అధికార యంత్రాంగం ముందుజాగ్రత్తతో వ్యవహరించి, తాగునీటి ఎద్దడి నివారణకు సత్వరచర్యలు చేపట్టాల్సి వుంది.

• కృష్ణపట్నం - మైదుకూరు

# ఇక జాతీయ రహదారి




**జిల్లాలోని కృష్ణపట్నం నుండి కడప జిల్లాలోని మైదుకూరు వరకు వున్న రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా గుర్తిస్తూ కేంద్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. మొత్తం నాలుగు రహదారులను కేంద్రం జాతీయ రహదారులుగా గుర్తించగా వాటిలో కృష్ణపట్నం - మైదుకూరు రహదారి వుండడం విశేషం.**

కృష్ణపట్నంపోర్టు - మైదుకూరుల మధ్య దూరం 182కిలోమీటర్లు. కృష్ణపట్నం వద్ద పోర్టు ఏర్పడ్డాక నెల్లూరు, సంగం, బద్వేల్ మీదుగా వెళ్లే మైదుకూరురోడ్డుకు అత్యధిక ప్రాధాన్యత ఏర్పడింది. కృష్ణపట్నంపోర్టులో కార్యకలాపాలు మొదలయ్యాక బళ్లారి, అనంతపురం ప్రాంతాల నుండి భారీగా ఇనుప ముడిఖనిజం పోర్టుకు రావడం, ఇక్కడ నుండి విదేశాలకు ఎగుమతి కావడం తెలిసిందే! ఇనుప ఖనిజం తవ్వకాలపై నిషేధం విధించాక రవాణా ఆగింది. అంతకు ముందయితే ప్రతిరోజూ వెయ్యిదాకా ఇనుపఖనిజం లారీలు పోర్టుకు రాకపోకలు సాగిస్తుండేవి. ఈ లారీల క్రిందపడే జిల్లాలో వందమందికిపైగా మరణించారు. ఈ లారీలవల్లే ఎన్నో ప్రమాదాలు జరిగాయి.

వై.యస్. ముఖ్యమంత్రిగా వున్నప్పుడు కృష్ణపట్నం నుండి మైదుకూరు వరకు ముంబైరోడ్డును నాలుగులైన్ల రహదారిగా మార్చడానికి ప్రయత్నించారు. ఈమేరకు ప్రతిపాదనలు కూడా పూర్తయ్యాయి. అయితే ఆయన హఠాన్మరణంతో ఈ ప్రతిపాదనలు మూలనపడ్డాయి. ఎట్టకేలకు ఇప్పుడు దీనికి జాతీయ రహదారి హోదా లభించింది. రాష్ట్రంలో వున్న ప్రధాన రహదారులలో ముంబైరోడ్డు

(మిగతా 5వ పేజీలో)

# సంక్షోభంలో ఆక్వా



- దిగులు మిగిల్చిన వెనామీ రొయ్యలు
- తగ్గిన సాగు విస్తీర్ణం
- బీళ్ళుగా మారుతున్న రొయ్యలగుంటలు
- అయోమయంలో రైతులు

జిల్లాలో తీరప్రాంతంలోని వాకాడు, చిట్టమూరు, కోట, వెంకటాచలం, తోటపల్లి గూడూరు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, చిల్లకూరు మండలాలు ఆక్వాసాగుకు పెట్టింది పేరు. ఒకప్పుడు ఇవన్నీ టైగర్, స్కాంపీరొయ్యలసాగుతో కళకళలాడాయి. క్రమేణా పలురకాల వైరస్‌లు వీటిపై తీవ్ర ప్రభావం చూపాయి. అనంతరం వెనామీ రొయ్యలు ఆక్వారైతులకు ఆశాదీపంగా కనిపించాయి. పంట దిగుబడి, ఆదాయం బాగా ఉండడంతో సుమారు 45వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో వెనామీ రొయ్యలసాగు చేపట్టారు. ప్రస్తుతం అది వేల ఎకరాలకు పరిమితమయింది. కోట, వాకాడు, చిల్లకూరు మండలాల్లో 10వేల ఎకరాల నుంచి 2వేల ఎకరాలకు తగ్గిపోయింది. దీనికి తోడు విద్యుత్ కోతలతో ఆక్వా రంగం విలవిలలాడుతుంది. వెనామీ రొయ్యలకు ఆక్సిజన్ కీలకం కావడంతో గుంతల్లో రోజంతా ఏరియేటర్లను ఆడించాలి, ఇందుకోసం 24 గంటలూ కరెంటు అవసరమవుతుంది. దీనికి లక్షలాది రూపాయలు విద్యుత్ సరఫ రాకు డిపాజిట్లు చెల్లించాల్సి వుంది. దీంతో ఆక్వారంగం పూర్తిగా సంక్షోభంలో చిక్కుకుంది. రొయ్యల గుంతలు బీళ్ళుగా మారాయి.

(మిగతా 5వ పేజీలో)

# జిల్లాకు రెవెన్యూ సోకులు

జిల్లాలో అదనంగా రెండు రెవెన్యూ డివిజన్‌లు, నెల్లూరు అర్బన్ మండలం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా వూపింది. మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కృషి ఫలితంగానే ఈ రెండు రెవెన్యూ డివిజన్‌లు, అర్బన్ మండలం వచ్చాయి.

మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఆత్మకూరును రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయనున్నారు. ఈ డివిజన్ పరిధిలోకి ఈ నియోజకవర్గంలోని మండలాలతో పాటు ఉదయగిరి నియోజకవర్గ పరిధిలోని మరో 4మండలాలు కలవనున్నాయి. ఆత్మకూరు నియోజకవర్గం ఇప్పటి దాకా నెల్లూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో వుంది. ఆత్మకూరు, ఏ.ఎస్.పేట, అనంతసాగరం, మర్రిపాడు మండలాల ప్రజలు ఆర్డీఓ ఆఫీసులో ఏ పనున్నా నెల్లూరుకు పరుగులు తీయాల్సివస్తుంది. సోమశిలకు నెల్లూరుకు వంద కిలోమీటర్ల దూరముంటుంది. ఒక వ్యక్తి ఆర్డీఓ ఆఫీసులో పని పెట్టుకున్నాడంటే ఒక రోజంతా వృథా అయిపోతుంది. దీనికితోడు డబ్బు ఖర్చు, కాళ్ల తిప్పట అదనం. అదే ఆత్మకూరులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుచేస్తే 10మండలాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా వుంటుంది.

ఇక నాయుడుపేట కేంద్రంగా మరో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కానుంది. సూళ్లూరుపేట నియోజకవర్గ పరిధిలోని మండలాలు ఈ డివిజన్ క్రిందకు వస్తాయి. ఇప్పటిదాకా ఈ నియోజకవర్గం గూడూరు రెవెన్యూ డివిజన్ క్రిందకు వస్తుండేది. తడ మండలంలోనో, పెళ్లకూరు మండలంలోనో ఆర్డీవోతో పనున్న ప్రజలు ఎంతో దూరం ప్రయాణించి గూడూరుకు రావాల్సి వచ్చేది. నాయుడుపేట రెవెన్యూ డివిజన్ అయితే వారికి ఆ ఇబ్బందులు తొలిగినట్లే! నెల్లూరు జనాభా 6లక్షలు దాటింది. నెల్లూరురూరల్

(మిగతా 5వ పేజీలో)


# మోగనున్న పంచాయితీ నగారా

పంచాయితీ ఎన్నికలకు త్వరలో నగారా మ్రోగనుంది. కొన్నేళ్లుగా సాగుతున్న ప్రత్యేక అధికారుల పాలనకు తెరపడనుంది. 2001జనాభా లెకక్కల ప్రకారమే ఎన్నికలు నిర్వహించనున్నారు. పంచాయితీ ఎన్నికలు ఎప్పుడా అని ఎదురుచూస్తున్న రాజకీయపార్టీల నాయకులకు రాష్ట్ర ప్రజలకు త్వరలో ఆ వినోదం తీరనుంది. మొదట పంచాయితీ అనంతరం మండల, జిల్లా పరిషత్‌కు ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. ఎన్నికల ఏర్పాట్లు గురించి జిల్లా కలెక్టర్లతో ఎన్నికల అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కులాల వారీగా గణనపూర్తి చేయాలని ఓటర్ల జాబితాను ప్రచురించాలని ఆదేశించారు. మొదట పంచాయితీ అనంతరం మండల, జిల్లా పరిషత్‌లకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఈ సమాచారం తెలుసుకున్న రాజకీయ నాయకులు వ్యూహరచనలో పడ్డారు.

జిల్లాలో 961 పంచాయితీలు, 9040వార్డులు ఉన్నాయి. 2011 జనాభా లెక్కలప్రకారం ఎస్సీలకు 18.30శాతం, ఎస్టీలకు 8.25శాతం బీసీలకు 34శాతం కలిపి మొత్తం 60.28శాతం స్థానాలు రిజర్వు అవుతాయి. మిగిలిన 39.72శాతం స్థానాలు ఓపన్ కేటగిరిలో వుంటాయి. స్థానిక సంస్థల ఎన్నికల పరిధిలో 14,79,346 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో అత్యధికంగా మహిళా ఓటర్లు 752259మంది ఉన్నారు. ఎస్సీలు 3లక్షల 52వేల 937మంది, ఎస్టీలు ఒక లక్ష 58వేల 601మంది, బీసీలు 5లక్షల 6వేల 837మంది, ఇతరులు 6లక్షల 67వేల 637మంది ఉన్నారు. ఇప్పటికీ జిల్లాలోని 437పంచాయితీలకు కార్యదర్శులు లేరు. ఎన్నికల నిర్వహణకు సిబ్బంది కొరత సమస్యగా ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో వార్డుల విభజన, కులాల వారీగా ఓటర్ల జాబితా ప్రచురణలాంటి సమస్యలు ఉన్నాయి.

PDF Compressor Free Version






## జగన్ కోసం జనం ఎదురుచూపు

రాష్ట్రంలో ఏ సంక్షేమ అభివృద్ధి పథకం ప్రవేశపెట్టినా ఆ పథకాలకు ఇందిరమ్మ, రాజీవ్‌గాంధీల పేర్లు పెట్టి దేశ ప్రజల మదిలో ఇందిర, రాజీవ్‌ల పేర్లు నిలిచిపోయే విధంగా వై.యస్.ఆర్. కృషి చేసారు. అటువంటి నాయకుడు మరణానంతరం ఆయన తనయుడు వై.యస్. జగన్ పట్ల, వై.యస్. కుటుంబం పట్ల కాంగ్రెస్‌పార్టీ వ్యవహరించిన తీరు బాధాకరం. రాష్ట్రప్రజలకు ఇచ్చిన మాట కోసం ఎంపి పదవిని, కాంగ్రెస్‌ను విడిచిపెట్టి జగన్ ఓదార్పు యాత్ర చేపట్టారు. దీనిని సహించలేక, జగన్ ఎదుగుదలను ఓర్వలేక సిబిఐని పావుగా వాడుకొని జగన్ పై అక్రమకేసులు బనాయించి జైలు పాలు చేశారు. ఈ అక్రమ కేసులన్నీ విచారణలో నిలువలేవు. జగన్ నిర్దోషిగా విడుదల అవుతారు. జగన్ విడుదల కోసం రాష్ట్ర ప్రజలు వేయికళ్ళతో ఎదురుచూస్తున్నారు.

బి.ఆర్. శాలి, కావలి.

## ఆధార్ అవస్థలు

క్షణం చిత్తం క్షణం మాయం అన్నట్లు ఆధార్ కేంద్రాలు ఎక్కడ ఉంటాయో, ఎప్పుడు ఉంటాయో అగమ్యగోచరంగా ఉంది. వయో వృద్ధులైన పెన్షనర్లు ఆధార్ దరఖాస్తుల కొరకు తిరగలేక నానా అవస్థలు పడుతున్నారు. అందువలన పెన్షనర్లు సబ్‌ట్రెజరీ ఆఫీసర్ వద్ద ఆధార్ దరఖాస్తులు తీసుకొనే ఏర్పాట్లు తదనుగుణంగా పెన్షనర్లకు సరిపడా ఆధార్ అప్లికేషన్లు ఎస్‌టిఓ వద్ద ఉంచే ఏర్పాట్లు చేస్తే మంచిది.

కురుగూరు రంగనాథం, నెల్లూరు.


## స్త్రీగా పుట్టనక్కరలేదు

సీతమ్మ, సావిత్రి, ద్రౌపతి వంటి భారతీయ వనితలు ఈ గడ్డ మీద పుట్టి ఎన్నో బాధలు అనుభవించారు. ఆ వారసత్వం ఇప్పటికీ కొనసాగుతుంది. మహిళలు శిశు ప్రాయం నుండే వృద్ధాప్యం వరకు నానా యాతనలు పడుతున్నారు. సాటి స్త్రీని తల్లిగా, చెల్లిగా చూసే సంస్కృతి లోపిస్తుంది. ఈ దేశంలో స్త్రీగా పుట్టకూడదనుకునే పరిస్థితి వస్తుంది.

వాస్తు రామచంద్ర, నెల్లూరు.

# 'ప్రభా'తం

## రంగులు మారిన రాజకీయం



**రాష్ట్రంలో రాజకీయాలు గతంలో ఎన్నడూ లేనంత గందరగోళంగా తయారయ్యాయి. దాదాపు ఐదేళ్ళ క్రితం వరకు కూడా రాష్ట్రంలో అధికారం కాంగ్రెస్, తెలుగుదేశంల మధ్య చేతులు మారుతుంటే రాబోయే ఎన్నికల్లో మరెన్నో పార్టీలు అధికార కేంద్రాన్ని నిర్ణయించడంలో కీలకంగా మారే అవకాశాలున్నాయి.**

తెలుగువాడి ఆత్మగౌరవాన్ని తట్టి లేపుతూ స్వర్గీయ ఎన్టీఆర్ స్థాపించిందే తెలుగుదేశంపార్టీ. దీనికి పూర్తిగా పునాది అప్పట్లో కాంగ్రెస్‌పార్టీపై వుండిన వ్యతిరేకతే. రాష్ట్ర కాంగ్రెస్ నేతలు తెలుగువారి ఆత్మగౌరవాన్ని ఢిల్లీ వీధుల్లో తాకట్టుపెడుతూ పదవుల కోసం ఢిల్లీ పెద్దల దయాదాక్షిణ్యాల మీద ఆధారపడ్డ తరుణంలో 1982లో ఎన్టీఆర్ తెలుగు దేశంను స్థాపించారు. 1983 ఎన్నికలలో తెలుగుజాతి ఆత్మ గౌరవాన్ని నలుదిశలా చాటేలా ఘనవిజయం సాధించారు. ఎన్టీఆర్ తన రాజకీయ చరిత్రలో ఏనాడూ కాంగ్రెస్‌తో రాజీపడలేదు. 1994లో అప్పటి ప్రధాని పి.వి. నరసింహారావు నంద్యాల లోక్‌సభ నుండి పోటీచేస్తే ఒక తెలుగోడు ప్రధాని అయ్యాడనే ఆనందంతో మద్దతు పలికాడేగాని ఆయన కాంగ్రెస్ నాయకుడని కాదు. ఎన్టీఆర్ కాంగ్రెస్‌పై వ్యతిరేకతను అంత నిక్కచ్చిగా అనుసరిస్తే, నేడు అదే పార్టీని నడుపుతున్న చంద్రబాబునాయుడు ఆ పార్టీని కాంగ్రెస్‌కే అమ్మకానికి పెట్టాడు. తెలుగుదేశంపార్టీ దుంపతెంచడమే తన లక్ష్యంగా పెట్టుకున్నాడు.

రాష్ట్ర రాజకీయాలు చాలా నిస్సిగ్గుగా తయారయ్యాయి. బాగా దిగజారిపోయాయి. విలువలు అన్నవి ఏ కోశానా కనిపించడం లేదు. రాష్ట్ర రాజకీయాలు చాలా గందరగోళ స్థితిలో వున్నాయి. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎవరు కాపాడుతున్నారో, ఎవరికి ఎవరు మద్దతుగా నిలుస్తున్నారో చెప్పలేని పరిస్థితులు నెలకొంటున్నాయి. పార్టీలకు సిద్ధాంత ప్రాతిపదికత లేకుండా పోయి అధికారమే పరమావధిగా మారుతుంది. రాష్ట్రంలో కిరణ్ సర్కార్‌ను పడిపోకుండా కాపాడుతున్నది చంద్రబాబేనన్నది బహిరంగమైపోయింది. కాంగ్రెస్‌కు తెలుగుదేశం మద్దతుగా నిలవడమన్నది ఆ పార్టీ చరిత్రలోనే ఆశ్చర్యపడాల్సిన విషయం. ఏ రాష్ట్రంలోనైనా అధికారపార్టీని పడగొట్టడానికి ప్రధాన ప్రతిపక్షం ముందుండాలి. కాని మన రాష్ట్రంలో మాత్రం అందుకు పూర్తి భిన్నమైన వాతావరణం నెలకొని వుంది. రెండేళ్ల క్రితం ఆవిర్భవించిన వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీని లక్ష్యంగా చేసుకుని ఇక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీలు ఒక్క తాటిపైకి చేరాయి. మొన్న టీఆర్ఎస్ అవిశ్వాసం నుండి ముమ్మాటికీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడింది తెలుగుదేశమే. ఇక్కడ ప్రజలకు ఒక సందేశం చేరుతుంది. రాష్ట్ర ప్రభుత్వం పట్ల ప్రజలు అసంతృప్తితో వున్నారు. సంక్షేమపథకాలకు వాతలు, విద్యుత్ కోతలు, సర్‌ఛార్జీల మోతలతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వమంటేనే విసిగి వేసారిపోయారు. ఈ ప్రభుత్వం ఎప్పుడెప్పుడు కూలుతుందా? అని ఎదురుచూస్తున్నారు. మరి అలాంటి ప్రభుత్వాన్ని తెలుగుదేశం కాపాడుకుంటూ వస్తుందంటే, కిరణ్ సర్కార్ విధానాలకు చంద్రబాబు మద్దతు పలికినట్లే! అంటే ప్రభుత్వ పాపాలలో చంద్రబాబుకూ భాగస్వామ్యం వున్నట్లే!

అధికారపక్షం, ప్రధానప్రతిపక్షం రెండూ కలిసి రాష్ట్రంలో వైయస్సార్ కాంగ్రెస్ బలాన్ని పెంచుతున్నాయి. జగన్ బూచిని చూపి తెలుగుదేశాన్ని పావుగా వాడుకుంటూ తన సర్కార్‌ను కాపాడుకోవడంలో కిరణ్ నూటికి నూరుపాళ్ళు విజయవంతమవుతున్నాడు. రేపు ఎన్నికలలో ఎలాగూ తిరిగి అధికారంలోకి వస్తామన్న నమ్మకం వారికి లేదు. పూర్తికాలం ప్రభుత్వాన్ని కొనసాగించడమే వారి లక్ష్యంగా కనిపిస్తుంది.

ఇక మిగిలిన పార్టీలను పరిశీలిస్తే ఒక్కోటి ఒక్కో రకంగావుంది. టీఆర్ఎస్‌కు తెలంగాణ తప్పితే మరో సమస్య లేదన్నట్లుగా వుంది. రాష్ట్ర రాజకీయాలలో టీఆర్ఎస్ మనుగడనే దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి ప్రశ్నార్థకంగా మారిస్తే అదే కాంగ్రెస్‌నేతలు మళ్ళీ దానికి ప్రాణం పోసారు. రాష్ట్ర రాజకీయాలు ఈరోజు ఇంత చెత్తగావుండడానికి మూలకారణం టీఆర్ఎస్ పెట్టిన తెలంగాణ చిచ్చే. ప్రజలకు తెలంగాణ తప్పితే ఇంకో అవసరం లేదన్నట్లుగా ఆ పార్టీ వ్యవహరిస్తుంది. బీజేపీ సైతం తెలంగాణ గానమే ఆలపిస్తూ వచ్చే ఎన్నికలలో ఒంటరిగానే పోటీచేస్తామంటున్నారు. జంటగా పోటీ చేయడానికి ఏ పార్టీ ముందుకురానప్పుడు ఒంటరిగా పోటీచేయక తప్పదుకదా! వామపక్ష పార్టీలు సీపీఎం, సీపీఐ వుంటే ఈ రెండింటిది చెరోదారి అన్నట్లుగా వుంది. సీపీఎం సమైక్యాంధ్ర వాదనకు, సీపీఐ తెలంగాణ వాదనకు కట్టుబడి వున్నాయి. ప్రతి ఎన్నికలలోనూ ఏదో ఒక పెద్దపార్టీకి తోకపార్టీలుగా మారే వామపక్షాలు ఈసారి ఏ పార్టీ తోకను పట్టుకుంటాయో చూడాలి.

మరోపక్క రాష్ట్రంలో జగన్ గాలి వీస్తుందనుకుంటున్నప్పటికీ ఆ పార్టీ వర్గాలలోనూ జగన్ బయటకు రాకపోతే పరిస్థితి ఏంటన్న ఆందోళన కనిపిస్తుంది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే వైయస్సార్ కాంగ్రెస్ విజయఢంకా మోగించడం ఖాయం అన్న వాతావరణముంది. తెలంగాణలో టీఆర్ఎస్ గట్టి పోటీ ఇచ్చినా సీమాంధ్రలో జగన్ ప్రభంజనం గ్యారంటీ అనే వాతావరణముంది. కాని ఎంత గాలి వున్నా నాయకత్వం సరిగా వుండాలి. జగన్ జైలుకు వెళ్లాక ఇప్పటికే ఆ పార్టీ నాయకత్వంలో సమన్వయం లోపించింది. ప్రతి జిల్లాలోనూ పార్టీ నాయకులలో వర్గ విభేదాలు తయారయ్యాయి. జగన్ ఇంకా బయటకు రాకపోతే ఇవింకా ముదిరిపోయే అవకాశాలున్నాయి. ఎన్నికలకంటే ముందు జగన్ జైలు నుండి బయటకు రాకపోతే ఆ పార్టీకి సంస్థాగతంగా కష్టాలు తప్పవు.

రాష్ట్రంలో ప్రతి పార్టీకి ఏదో ఒక సమస్య వుంది. కాబట్టే నిలకడలేని విధానాలవైపు పరుగులు తీస్తున్నాయి. రాష్ట్ర రాజకీయాలలో అనిశ్చిత వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి.

# 'అంతర్'జాతీయం

- సుప్రీంకోర్టు మాజీన్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి గోవా లోకయుక్తగా ప్రమాణస్వీకారం చేసారు. ఆయన నియామకాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్, ఎన్‌సిపిలు వ్యతిరేకించాయి.
- ఏప్రిల్ 1వ తేదీ నుండి హెచ్ 1 బీ వీసా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. అమెరికా ప్రభుత్వ నిర్ణయంతో భారత ఐ.టీ రంగ నిపుణులు హర్షం వ్యక్తం చేసారు.
- ఉత్తరప్రదేశ్‌లోని అధికార సమాజ్‌వాదీపార్టీతో తెగతెంపులు చేసుకుంటున్నట్లు ఢిల్లీ జామామసీదు షాహి ఇమామ్ మౌలానా సయ్యద్ అహ్మద్ బుఖారీ ప్రకటించారు. ఎస్పీ ఏడాది పాలనలో ముస్లింలకు ఒరిగిందేమీ లేదని ఆయన పేర్కొన్నారు.
- మధ్యప్రదేశ్‌లోని దాతియా పట్టణానికి సమీపంలోని అటవీప్రాంతంలో స్విట్జర్లాండ్ దేశపు మహిళ(39)పై అత్యాచారం జరిగింది. ఈ కేసులో ఆరుగురు నిందితులను మధ్యప్రదేశ్ పోలీసులు అరెస్ట్‌చేశారు.
- ఆస్ట్రేలియాతో జరుగుతున్న నాలుగుటెస్ట్‌ల సిరీస్‌ను భారత్ 3-0తేడాతో ఇప్పటికే సొంతం చేసుకుంది. మొహాలీలో జరిగిన మూడోటెస్టులో భారత్ 6వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ టెస్ట్ మొదటి ఇన్నింగ్స్‌లో ఆడిన తొలి టెస్ట్‌లోనే శిఖర్‌ధావన్ అత్యంత ఫాస్టెస్ట్ సెంచరీ చేసి వరల్డ్‌రికార్డు సాధించాడు.
- కేరళ మత్స్యకారులను చంపిన కేసులో ఇటలీ తమ సిబ్బందిని భారత్‌కు అప్పగించడానికి నిరాకరించిన నేపథ్యంలో సుప్రీంకోర్టు సోమవారం ఆ దేశ రాయబారి డేనియల్ మున్సినికి చీవాట్లు వేసింది. మార్చి 22లోపు ఇద్దరు ఇటలీ నావికాదళ సిబ్బందిని భారత్‌కు తీసుకురాకపోతే రాయబారిపై కోర్టు ధిక్కరణ అభియోగం మోపాల్సి వుంటుందని, ఇటలీ రాయబారి మాట ఇచ్చి తప్పారు కాబట్టి వారికి దౌత్యరక్షణ వర్తించదని సుప్రీం స్పష్టం చేసింది.
- బాలికా విద్య కోసం పోరాడుతూ తాలిబన్‌ల కాల్పుల్లో గాయపడి లండన్‌లో కోలుకున్న పాకిస్థాన్ బాలిక మలాలాయూసఫ్‌జాయ్(15) మళ్ళీ బడిబాట పట్టింది. బ్రిటన్, బర్మింగ్‌హోమ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ హైస్కూల్‌లో 19వ తేదీ తొలిరోజు స్కూల్‌కు ఆమె హాజరైంది.
- భారత్, చైనాల మధ్య సరిహద్దు సమస్యకు పరిష్కారం అంత సులభం కాదని చైనా కొత్త అధ్యక్షుడు జీజిన్‌పింగ్ పేర్కొన్నారు. అయితే సమస్య పరిష్కారమయ్యేంత వరకు కూడా సరిహద్దులో శాంతిని కొనసాగించాలని పేర్కొంటూ ఇందుకు పంచసూత్రాల ఫార్ములాను ఆయన ప్రతిపాదించారు.

# వార్త వ్యాఖ్య

వార్త :- పథకాల ప్రచారంలో విఫలమయ్యాం. - విశాఖలో సీఎం కిరణ్.
వ్యాఖ్య :- *ఏవన్నా అమలు చేస్తుంటేగా... ప్రచారం చేసుకోవడానికి!*
వార్త :- ఒంటరిగానే అసెంబ్లీ బరిలోకి! - బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి.
వ్యాఖ్య :- *జంటగా కలవడానికి ఎవరూ రారుగా!*
వార్త :- కాంగ్రెస్‌కు మద్దతివ్వడంతోనే టీడీపీ చచ్చిపోయింది. - కేసీఆర్.
వ్యాఖ్య :- *రాజకీయాలలో ఆత్మహత్యలు చేసుకోవడమంటే ఇదేనేమో!*
వార్త :- ఏప్రిల్‌లో పంచాయితీ ఎన్నికలు.
వ్యాఖ్య :- *ఫైనల్స్‌కు ముందు రిహార్సల్స్ అన్నమాట.*
వార్త :- ఎన్టీఆర్‌లా పేరు తెచ్చుకోవాలని వుంది. - పాదయాత్రలో చంద్రబాబు.
వ్యాఖ్య :- *మిమ్మల్నీ ఎవరో ఒకరు వెన్నుపోటు పొడిస్తే సరి.*
వార్త :- యోగ సాధనతో ఉన్నతజీవన విధానం. - జస్టిస్ పి.సి.ఘోష్.
వ్యాఖ్య :- *రాజకీయనాయకులందరి చేత బలవంతంగానైనా యోగ చేయించాలి.*
వార్త :- రాష్ట్ర రాజకీయాలు భ్రష్టుపట్టాయి. - వెంకయ్యనాయుడు.
వ్యాఖ్య :- *జాతీయ రాజకీయాలేవో బాగున్నట్లు.*
వార్త :- టీడీపీ ప్రజల విశ్వాసం కోల్పోయింది. - మాజీమంత్రి చంద్రశేఖర్.
వ్యాఖ్య :- *కాంగ్రెస్ విశ్వాసం మాత్రం పొందింది.*
వార్త :- రాష్ట్రంలో 'తెలుగు కాంగ్రెస్'. - వైయస్సార్ కాంగ్రెస్ ఎమ్మెల్యేల మండిపాటు.
వ్యాఖ్య :- *త్వరలో ఆ పేరుతో పార్టీ వచ్చినా ఆశ్చర్యపోవాల్సింది లేదు.*
వార్త :- మా అనుమతి లేనిదే దేశం విడిచివెళ్లొద్దు. - 'అగస్టా' నిందితులకు సీబీఐ ఆదేశం.
వ్యాఖ్య :- *అనుమతి లేకుండా వెళితే ఓకేనా?*
వార్త :- జూన్ వరకు అధికారిక కోతలే!
వ్యాఖ్య :- *తర్వాత అనధికార కోతలా?*
వార్త :- కరుణ కటీఫ్. - యూపీఏ సర్కార్ నుండి డిఎంకె బయటకు.
వ్యాఖ్య :- *ఎన్నికలొస్తున్నాయి కాబట్టి ముందు జాగ్రత్తన్నమాట.*

PDF Compressor Free Version





# ప్రాణాలతో "సెల్"గాటం

## చేతిలో సెల్.. అతిగాపోతే కిల్!

"సెల్‌ఫోను సుందరి స్మైలిస్తే నందడి, మెల్‌బోర్న్ అందాలన్నీ నీలో చూసాలే" అన్నాడు వెనకటికో సినీకవి.

నిజమే గత శతాబ్ది తొంభయ్యో దశకంలో భారతదేశంలోకి ప్రవేశించిన సెల్‌ఫోన్ అప్పుడు ఒక స్టేటస్ సింబల్. అందమైన అమ్మాయి చేతిలో సెల్‌ఫోన్ వుంటే అదొక ఆభరణంగా ఆమె అందం ద్విగుణీకృతమయ్యేది. కాని నేడు అందానికి, ఆడంబరానికి అది హేతువే కాదు... అందరి అవసరాలకు అత్యవసరంగా తోడ్పడే వాయువేగ సేతువు కూడా! అత్యంత వేగవంతమైన మన జీవన ప్రయాణంలో ఒకరి నుంచి ఒకరికి సమాచారాన్ని క్షణాల్లో చేరవేయడానికి ఒక మంచి సాధనం కూడా. అంతేకాదు సెల్‌ఫోన్ ఉపయోగాలు అంతటితో ఆగిపోలేదు. బహుళ ప్రయోజనకారిగా మారిపోయింది. ఈ సాధనంతో అనుసంధానమయ్యే వివిధ నెట్‌వర్క్‌ల సేవలతో



పాటు, మెమొరీకార్డు సహాయంతో ఇది చేకూర్చే సౌలభ్యాలు చిట్టా రాయాలంటే చాంతాడవుతుంది. క్యాలిక్యులేటర్, స్టాప్‌వాచ్, క్యాలెండర్, అలారం, వరల్డ్‌క్లాక్, కెమెరా, ఆడియో ప్లేయర్, వీడియో ప్లేయర్, యఫ్ఎం రేడియో, టి.వి. ప్లేయర్‌తో పాటు అనేక సదుపాయాలు వనకూర్చే బుల్లి అక్షయపాత్ర ఇది అని చెప్పొచ్చు.

దీని వినియోగదారుల సంఖ్య ప్రతిరోజూ కాక ప్రతి నిముషానికి వేలసంఖ్యలో పెరిగిపోయి ఇప్పుడు చేతిలో అది లేనిదే ఏ పనీ జరగని పరిస్థితి వచ్చింది. రికామీగా తిరిగే రోమియోల దగ్గర్నుంచి రెక్కల కష్టంతో బతికే రిక్షా కార్మికుడి దాకా ఇది అత్యవసర వినియోగవస్తువుగా మారిపోయింది. దర్జీ, పెయింటింగ్, బేల్దారు మొదలైన పనులు చేసుకునే మేస్త్రీలకు, కూలీలకు రోజువారీ పనుల నిర్దేశానికి ఇదే ఆలంబనగా నిలుస్తోంది. 108, 104 మొదలగు అత్యవసర సేవల వినియోగానికి ఇదే ఆధారం. ల్యాండ్ ఫోన్ మాత్రమే వుండేరోజుల్లో ముఖ్యమైన సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికే దానిని ఉపయోగించేవారు. కాని వేగవంతమైన, విలాసవంతమైన జీవన విధానానికి అలవాటు పడిన మనం సెల్‌ఫోన్‌కు బానిసలుగా మారిపోయామనిపిస్తోంది. దీనివల్ల అనేక లాభాలున్నా, దానినిమించిన నష్టాలున్నాయన్న మాట మరచిపోకూడదు. దీనిని ఎక్కువ వినియోగించడం వల్ల రేడియేషన్‌కు గురై అనేక రుగ్మతలకు లోనై ప్రాణాపాయాన్ని కొని తెచ్చుకొంటారని శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు.

నేడు అత్యంత వేగంగా దూసుకుపోతున్న కాలగమనంలో సాంకేతిక పరిజ్ఞానం ఇంకొంత ముందుకు సాగుతోంది. పర్యవసానంగా ప్రతిఒక్కరి చేతిలో, జేబులో, నడుముకు కట్టుడి కవచకుండలాల్లా చెవిలో బ్లూటూత్‌లు, సెల్‌ఫోన్లు దర్శనమిస్తున్నాయి. నగరంలో దాదాపు పదిలక్షల సెల్‌ఫోన్లు ఉన్నాయనడంలో అతిశయోక్తి లేదు. ప్రస్తుత ఆధునిక యుగంలో మనం గమనిస్తే చేతిలో సెల్‌ఫోన్ లేని కుర్రకారు, యువతులు, గ్రామీణ మహిళలు, వృద్ధులు కనిపించడం లేదు. సెల్‌లో బ్యాలెన్స్ లేకపోతే ఆ పూట టిఫిన్ చేయకపోయినా ఫర్వాలేదనుకుని ఆ డబ్బుతో సెల్‌లో బ్యాలెన్స్ వేయించుకునే వారు కూడా ఉన్నారు. చాలామంది కాలేజీ చదివే అమ్మాయిలు సెల్‌ఫోన్లో మాట్లాడుతూ తన్మయత్వంతో రోడ్డు దాటుతుంటారు. ఇది చాలా దురలవాటు. అసలు సెల్‌ఫోన్ అవసరం ఎంత వరకో అంతవరకే ఉపయోగించుకోవాలి. అతిగా వాడితే వాటి నుండి వెలువడే తరంగాలు మెదడు కణాలపై దుష్పరిణామాలను చూపిస్తుందని వైద్యులు చెప్తున్నారు. కొంతమంది బస్‌లో ప్రయాణిస్తూ తోటి ప్రయాణీకులకు ఇబ్బంది అనే విషయాన్ని ఏ మాత్రం పట్టించుకోకుండా తెగ వాగేస్తుంటారు. ఇంతచేసి అదేమైనా ముఖ్యవిషయమా అంటే... కాదు - ఉబుసుపోని కబుర్లు. చాలామంది ముఖ్యమైన విషయాలకన్నా పనికిమాలిన విషయాలనే ఎక్కువగా సెల్‌లో మాట్లాడేస్తుంటారని ఒక సర్వేలో తేలింది.



సెల్‌ఫోన్ కంపెనీలు కూడా మార్కెట్టులో తమ ఉత్పత్తులు పెంచుకోవడానికి సినీరంగంలో ప్రముఖులైన వారితో పబ్లిసిటీలు, అనేక ఆఫర్లు, ప్రచారాలు కొనసాగిస్తున్నాయి. ప్రస్తుతం మహిళలకు సెల్‌ఫోన్ ఒక ఉపయోగకరమైన ఆయుధమనే చెప్పాలి. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే తమ వాళ్లకు తెలియజేసే అవకాశాలున్నాయి. కాని దుర్వినియోగం చేసే వాళ్లే ఎక్కువైపోతున్నారు. ఏ విజ్ఞాన పరికరమైనా మంచి కోసమే తయారుచేయబడినా, దాని వాడకం సమాజవిశ్రుంఖల అనైతిక కార్యకలాపాలకు ఎక్కువగా వినియోగించబడుతోంది. అసలు సెల్‌ఫోన్ వాడటంలో మంచి లేదా, అసలు ఉపయోగంలేదా అంటే ఎందుకు లేదు... బోలెడున్నాయి. ఒక్క సెల్‌ఫోన్ ద్వారా మన కళ్లముందే ప్రమాదానికి గురైన వారిని రక్షించేందుకు 108కి ఫోన్‌చేసి సకాలంలో వారికి వైద్యం అందేలా చేయవచ్చు. ఇయర్‌ఫోన్స్ చెవిలో పెట్టుకుని పాటలు వింటూ రోడ్డు దాటటం, రైలుపట్టాలు దాటడం, బైక్‌లు డ్రైవ్ చెయ్యడం వంటివి మానేస్తే మంచిది. లేకుంటే ప్రమాదాలు కొనితెచ్చుకోవడం అవుతుంది.

## ప్రమాదం అంచున ప్రభుత్వం

(మొదటిపేజీ తరువాయి)

వామపక్షాలు, దళ్(యు) వంటి పార్టీల నేతృత్వంలో మూడో కూటమి నిర్మాణానికి సన్నాహాలు జరుగుతున్న నేపథ్యంలో కరుణానిధి ఆవైపు మొగ్గుచూపే అవకాశాలున్నాయి. అయితే డిఎంకె మద్దతు ఉపసంహరించగానే యూపిఏ వెంటనే పడిపోయే పరిస్థితి లేదు. యూపిఏను కూల్చగల శక్తి సామర్థ్యాలు ఇప్పుడు ఆ కూటమికి బయటనుండి మద్దతునిస్తున్న సమాజ్‌వాది పార్టీ లేదా బహుజన సమాజ్ పార్టీలకు మాత్రమే వున్నాయి. కాని ఇవి ఎంతవరకు యూపిఏను కూలుస్తాయన్నదే ప్రశ్న. ఎఫ్‌డిఐల వంటి బిల్లు విషయంలో సైతం బిఎస్పీ యూపిఏకు పరోక్ష సహకారం అందించింది. దీనికి కారణం ఆ పార్టీ అధినేత మాయావతి మీద వున్న అవినీతి కేసులే! సిబిఐని పావుగా వాడుకుంటూ యూపిఏ పెద్దలు మాయావతిని తమ గుప్పిట్లో వుంచుకున్నారు. అసలే యూపీలో అధికారం కోల్పోయి మాయావతి దిక్కుతోచని స్థితిలో వుంది. ఇప్పటికిప్పుడు యూ[illegible] పేచీ పెట్టుకుని చిక్కులు కొనితెచ్చుకోవాలనే ఆలోచనలో ఆమె లేదు.

ఇక యూపిఏకు ఏదైనా ముప్పుందంటే సమాజ్‌వాది పార్టీ వల్లే! ఈ పార్టీ మద్దతు ఉపసంహరించినా యూపిఏ ప్రభుత్వం మైనార్టీలో పడడం ఖాయం. ములాయంను కూడా అవినీతి కేసులో సిబిఐని బూచిగా చూపే యూపిఏ వాడుకుంటుంది. అయితే యూపీలో తమ పార్టీ అధికారంలోకి వచ్చి, తన కొడుకు అఖిలేష్‌ను సీఎంను చేసాక ములాయం ఈ కేసులను లెక్కచేయడం లేదు. ఆయన మూడో కూటమి, తనకు ప్రధాని పదవి అనే అంశాల మీదనే దృష్టి సారించాడు. మూడోకూటమికి ప్రాతినిధ్యం వహిస్తూ, కూటమిలోని అన్ని పార్టీల వారు నువ్వే మా భావిప్రధానివి అని అంటే ములాయం తక్షణమే కేంద్రంలోని యూపిఏకు మద్దతు ఉపసంహరించడానికి సిద్ధం. ఆ క్షణం కోసమే ఆయన ఎదురుచూస్తున్నాడు. అంతేకాకుండా పార్లమెంట్‌లో ములాయంకు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయంటూ కేంద్రమంత్రి బేణీప్రసాద్ వర్మ చేసిన వ్యాఖ్యలు కూడా కాంగ్రెస్ - సమాజ్‌వాదీల మధ్య దూరాన్ని పెంచాయి. యూపిఏకు ఈరోజు కాకున్నా రేపయినా ప్రమాదం పొంచివున్నది ములాయంసింగ్‌యాదవ్ నుండే! కాంగ్రెస్ జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తుంది. ఏ మాత్రం తమ సర్కార్ మైనార్టీలో పడ్డా లోక్‌సభను రద్దు చేసి ముందస్తు ఎన్నికలకు పోవడానికి సన్నద్ధమవుతుంది. బీజేపీ, వామపక్షాలతో సహా మిగిలిన అన్ని రాజకీయపక్షాలు ఎన్నికలకు సై అంటున్న తరుణంలో మరోసారి దేశానికి మధ్యంతరం ముప్పు తప్పదనిపిస్తుంది.

## రెవెన్యూ సోకులు

(3వ పేజీ తరువాయి)

మండలంకు నగరానికి కలిపి ఒకే తహశీల్దార్ కార్యాలయం వుంది. దీంతో తహశీల్దార్ కార్యాలయంలో పనులు కావాలంటే గగనంగా మారింది. నెల్లూరుకు ప్రతి రోజూ ఎవరోఒకరు విఐపిలు వస్తుండడం వల్ల తహశీల్దార్‌తో పాటు ఇతర రెవెన్యూ సిబ్బందికి ప్రొటోకాల్ డ్యూటీలు ఎక్కువై ప్రజలకు అందుబాటులో లేకుండా వుంటున్నారు. దీంతో తహశీల్దార్ కార్యాలయంలో పనులు తొందరగా జరగవనే పేరొచ్చింది. పెరిగిన జనాభా, సమస్యలను దృష్టిలో పెట్టుకుని నెల్లూరులో మరో రెండు తహశీల్దార్ కార్యాలయాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఎట్టకేలకు అర్బన్ మండలం మంజూరు చేయడం శుభపరిణామం.

## జాతీయ రహదారి

(3వ పేజీ తరువాయి)

కీలకమైంది. ఈ రోడ్డు మహారాష్ట్రలోనే కాదు, కర్నాటక, మధ్యప్రదేశ్‌లకు పోవడానికి కూడా అనువుగా వుంటుంది. ముఖ్యంగా మైదుకూరు పెద్దకూడలి. కడప, కర్నూలు, అనంతపురం జిల్లాలకు వెళ్లే రహదారులు ఇక్కడనుండే చీలుతుంటాయి. ఈ రహదారికి ఇప్పటికైనా జాతీయ హోదా దక్కడం సంతోషించాల్సిన విషయమే.

## సంక్షోభంలో ఆక్వా

(3వ పేజీ తరువాయి)

సాగువిస్తీర్ణం తగ్గింది. రైతులు అయోమయంలో పడి ఆక్వారంగాన్ని వీడి ప్రత్యామ్నాయం వైపు చూస్తున్నారు. రైతులకు సహకారమందించాల్సిన ఎంపెడా అధికారులు చేపట్టిన చర్యలు కూడా నిరాశాజనకంగా మారాయి.

## సీఐల బదిలీలు

జిల్లాలో పలువురు సిఐల బదిలీలయ్యాయి. నెల్లూరు రూరల్ సిఐగా పనిచేస్తున్న వై.జయరామసుబ్బారెడ్డిని స్పెషల్ బ్రాంచ్-1 సిఐగా బదిలీ చేసారు. ఏసిబి సిఐగా పనిచేస్తున్న సుధాకర్‌రెడ్డిని నెల్లూరు రూరల్ సిఐగా నియమించారు. వీఆర్‌లో వున్న రోశయ్యను పొదలకూరు సిఐగా నియమించి ఇక్కడ పనిచేస్తున్న రవికుమార్‌ను అల్లూరు మండలంలోని ఇస్కపల్లి మెరైన్ సిఐగా బదిలీచేస్తూ గుంటూరు రేంజ్ ఐజి రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు.

## పురుగుమందులతో అపాయం

**- జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్**



కూరగాయల కొనుగోలును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

కూరగాయల సాగులో పురుగుమందుల వినియోగం తగ్గించాలని, అధికమోతాదులో ఈ మందులను వాడడంవల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ పేర్కొన్నారు. 17వ తేదీ జిల్లా ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో నెల్లూరులోని మాగుంట లే అవుట్ లెక్చరర్స్‌కాలనీలో రైతులు, వినియోగదారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడుతూ పురుగుమందులు అధికంగా వాడడం వల్ల కూరగాయల నాణ్యత తగ్గడమే కాకుండా సాగుఖర్చు పెరుగుతుందన్నారు. ఎరువుల వినియోగంలో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉద్యాన సహాయసంచాలకులు ధర్మజ మాట్లాడుతూ నగరంలో ప్రతి సోమ, గురువారాల్లో వేదాయపాళెం, భక్తవత్సలనగర్, మాగుంట లేఅవుట్‌లలో విక్రయకేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఉద్యాన ఉత్పత్తిదారుల సంఘాల ఆధ్వర్యంలో ఈ కేంద్రాల్లో కూరగాయల అమ్మకం జరుగుతుందన్నారు. వేదాయపాళెం ఎంబిఎస్ కల్యాణ మండపం ఎదురుగా ఉదయం 7గంటల నుంచి 8గంటల వరకు, భక్తవత్సలనగర్ సాయిబాబా గుడి వద్ద 8గంటల నుంచి 9గంటల వరకు, మాగుంట లే అవుట్ లెక్చరర్స్‌కాలనీలో సాయంత్రం 5గంటల నుండి 8గంటల వరకు కూరగాయల విక్రయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవనశాఖ సహాయసంచాలకులు శ్రీనివాసరావు, రైతులు, వినియోగదారులు పాల్గొన్నారు.

## ఇక కె.వి.పి...!

(మొదటిపేజీ తరువాయి)

జగన్ అక్రమాస్తుల కేసుకు మూలం కూడా కెవిపినే! ఎమ్మార్ కేసుకు పునాది ఆయనే! ఈ కేసుల నుండి తప్పించుకోవడం కోసమే ఆయన కాంగ్రెస్‌లో వుంటున్నాడు. ఎందరో కాంగ్రెస్ నాయకులు వై.యస్.ను తిడుతున్నా... తాను చెవులు మూసుకున్నాడేగాని, వారి నోర్లు మూసే ప్రయత్నం చేయలేదు.

కాని మిత్రునికి చేసిన ద్రోహానికి తగిన శాస్తి జరగకుండా పోతుందా? వై.యస్. హయాంలో కె.వి.పి చేసిన అక్రమాలపై సిబిఐ దృష్టి సారించినట్లు తెలుస్తుంది. ఈమేరకు సమాచారం రాబట్టే ప్రక్రియ కూడా మొదలైంది. మనం త్వరలోనే సిబిఐ బోనులో కె.వి.పిని చూడొచ్చు. కె.వి.పి.ని కదిలిస్తేగాని "జగన్" మూలాలు బయటకు రావని సిబిఐ భావించి కె.వి.పి పైన దృష్టి పెట్టినట్లు సమాచారం.

PDF Compressor Free Version





సోమవారం నెల్లూరులోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డేలో అర్జీదారుల నుండి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న జిల్లా ఎస్పీ బి.వి.రమణకుమార్

## ఏసిసుబ్బారెడ్డి చిరస్మరణీయుడు

జిల్లా అభివృద్ధికి కృషిచేసిన దివంగత ఏసి సుబ్బారెడ్డి చిరస్మరణీయుడని నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఏసి సుబ్బారెడ్డి 108వ జయంతి వేడుకలు సందర్భంగా ఏసిసెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం బాలాజీ నగర్‌లోని ఏసి సుబ్బారెడ్డి సమాధి వద్ద సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 30ఏళ్ళపాటు నెల్లూరు మునిసిపల్ ఛైర్మన్‌గా పనిచేసి గుర్తింపు తెచ్చుకున్నారని, రాజకీయాల్లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న మహనీయుడు ఏసి సుబ్బారెడ్డి అని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిసిసి ఇన్‌చార్జి అధ్యక్షుడు చాట్ల నరసింహారావు, ఆనం విజయ్‌కుమార్‌రెడ్డి, నన్నపురెడ్డి పెంచల రెడ్డి, రావులపల్లి వెంకటజ్యోతి, పిండి సురేష్ ఆనం రంగ మయూర్‌రెడ్డి, రంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఏసి సుబ్బారెడ్డికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నేతలు

## విద్యార్థులకు రెక్కలు... పాఠ్యపుస్తకాలు ముక్కలు



ఇంటర్ పరీక్షలు ముగిసాయి. ఏడాది పొడవునా కష్టపడి చదివి పరీక్షలు వ్రాసిన విద్యార్థులు ఇక ఫలితాల కోసం ఎదురుచూడాలి. ఫలితాల మాటేమోగాని ఇంటర్ జూనియర్, సీనియర్ విద్యార్థులు ఆఖరిరోజు పరీక్షవ్రాసి సమాధానపత్రం ఇన్విజిలేటర్‌కు ఇచ్చిన మరుక్షణమే అప్పుడే రెక్కలు తొడిగిన పక్షుల్లా కేకలు పెడుతూ ఆనందంతో బయటకు వచ్చారు. బస్సుల్లో తమ కాలేజీల వద్దకు తిరిగివెళుతూ పుస్తకాలను చించి కాగితాలను రోడ్లంతా పరిచారు. ఆనందంతో కేకలు వేయడం బాగానే వుంది. పుస్తకాలు చించి విసిరేసే సంస్కృతి మంచిది కాదు. ఒకప్పుడు పాత టెక్స్ట్ పుస్తకాలను మన జూనియర్‌లుగా వుండే బంధువులకో, స్నేహితులతో ఇచ్చేవాళ్లం. కాబట్టి వాళ్లకు పుస్తకాలు కొనే పనివుండేది కాదు. కాని ఇప్పుడంతా కార్పొరేట్ కాలేజీల మయం. పుస్తకాలు కూడా ఓ వ్యాపారమే. కాబట్టి కాలేజీలో చేరిన ప్రతి విద్యార్థి కొత్త పుస్తకాలు కొనాల్సిందే! అందుకే పాత పుస్తకాలు ముక్కలు ముక్కలై రోడ్ల మీద ఎగురుతున్నాయి.



నెల్లూరు కబుర్లు

## పర్యటనపై నమ్మకం పోయింది

జిల్లాలో ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పర్యటన 'అదిగో పులి వచ్చె నాన్న' కథ లాగా తయారయ్యింది. ఈ నెలలో సీఎం పర్యటన వుండొచ్చని, బహుశా 24, 25, 26తేదీలలో ఇందిరమ్మబాట వుండొచ్చని కలెక్టర్ చెప్పినా కూడా అధికారులు నమ్మడం లేదు. సీఎం హైదరాబాద్‌లో హెలికాప్టర్ ఎక్కి నెల్లూరు పోలీసుగ్రౌండ్‌లో దిగాకగాని అధికార యంత్రాంగానికి, పోలీసులకు ఆయన పర్యటన మీద నమ్మకం కుదిరేటట్లు లేదు.

## నాణ్యమైన విద్యకు "రత్నం" కృషి



నమూనాలు ప్రదర్శిస్తున్న 'రత్నం' చిన్నారులు

నిరంతరం విద్యార్థుల పటిమకు పదును పెట్టేలా వైవిధ్యంగా సహ పాఠ్యాంశాలలో పోటీలు నిర్వహించడం "రత్నం" విద్యాసంస్థల ప్రత్యేకత. పాఠ్యాంశాల బోధనలో అధునికతతో క్రమశిక్షణ కలిగిన నడవడికను విద్యార్థులలో పాదుకొలిపేలా డాక్టర్ కిషోర్స్ రత్నం హైస్కూలులో కృషిచేయడం జరుగుతుంటుంది. ఈ నెల 16న నెల్లూరు దర్గామిట్ట సరస్వతినగర్‌లోని రత్నం విద్యాసంస్థలలో వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులందించారు. ఐఐటీ, టెక్నో, జూనియర్ ఒలింపియాడ్ పాఠశాలల్లో పలు సందర్భాల్లో ఈ యేడాది నిర్వహించిన వక్తృత్వ, వ్యాసరచన, అకడమిక్స్, ప్రాజెక్ట్ సెమినార్‌లలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను పొందిన విద్యార్థులకు రత్నం ఐఐటీ స్కూలు ప్రిన్సిపాల్ సునీల్‌కుమార్, టెక్నో స్కూలు ప్రిన్సిపాల్ సంయుక్త, రత్నం విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, సీనియర్ మేనేజర్ రాజేష్‌బాబులు బహుమతి ప్రదానం చేసారు. నెల్లూరు పెద్దబజారులో గల రత్నం ఐఐటి, టెక్నో, కాన్సెప్ట్ స్కూల్స్‌లో అదే రోజు సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఈ ఎగ్జిబిషన్‌లో విద్యార్థులు ప్రదర్శించిన విజ్ఞానశాస్త్ర అంశాల నమూనాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ ఎగ్జిబిషన్‌ను అక్కడి రత్నం పాఠశాలల డైరెక్టర్లు డాక్టర్ వేణుగోపాల్, రమావేణుగోపాల్, ప్రిన్సిపల్స్ రోమెల్‌రాయ్, రూపశ్రీలు పర్యవేక్షించారు. ఇలా నగరం నలుమూలలా వున్న రత్నం విద్యాసంస్థలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో చేస్తున్న కృషి అభినందనీయం.

## నగర మాస్టర్ ప్లాన్‌కు ప్రభుత్వ ఆమోదం

నెల్లూరు నగర మాస్టర్‌ప్లాన్‌ను రాష్ట్ర మునిసిపల్ శాఖామంత్రి మానుగుంట మహీధర్‌రెడ్డి హైదరాబాదులోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో సోమవారం నగరపాలక, పురపాలక ఉన్నత స్థాయి అధికారుల సమావేశంలో ఆవిష్కరించినట్లు నెల్లూరు నగరపాలకసంస్థ కమీషనర్ డా॥ టి.యస్.ఆర్.ఆంజనేయులు తెలిపారు.



మాస్టర్‌ప్లాన్‌ను విడుదల చేస్తున్న మంత్రి మహీధర్‌రెడ్డి, పక్కన నెల్లూరు నగర పాలకసంస్థ కమీషనర్ టియస్‌ఆర్ ఆంజనేయులు

నెల్లూరు పురపాలక హోదా నుంచి నగరపాలక హోదా పొందిన తర్వాత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని నగర మాస్టర్ ప్లాన్‌ను రూపొందించినట్లు తెలిపారు. నూతనంగా రూపొందించిన మాస్టర్‌ప్లాను ప్రభుత్వం ఆమోదించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్లాను అందుబాటులోకి రావడం వల్ల ప్రజలకు ఎంతో సౌలభ్యంగా ఉంటుందన్నారు.

## మార్చి 22 నుండి తల్పగిరి రంగనాథుని బ్రహ్మోత్సవాలు

పవిత్ర పినాకిని నదీ తీరాన వెలసియున్న శ్రీ తల్పగిరి రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 22 తేదీ నుండి ఏప్రిల్ నెల 2వతేదీ వరకు వైభవంగా జరగనున్నాయి. ఈ సందర్భంగా నగర శాసనసభ్యులు ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి వివిధశాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను విడుదల చేశారు. శ్రీ స్వామి వారి బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా అన్ని ఏర్పాట్లను చేయాలన్నారు. ఆలయ సమీపంలోని రోడ్లన్నీ శుభ్రం చేయాలని ఆదేశించారు. వీధిలైట్లు సక్రమంగా వెలిగేటట్లు చూడాలని, పెన్నా నది సమీపంలో ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేయాలన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, మంచి నీటి సరఫరా బ్లీచింగ్ వేయడం వంటి కార్యక్రమాలపై పర్యవేక్షణ ఉండాలన్నారు.



బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రథోత్సవానికి రోప్‌పార్టీని సిద్ధంగా ఉంచాలన్నారు. తెప్పోత్సవంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ఉత్సవాలు జరిగే రోజుల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని, ఆలయ ప్రాంగణంలో మహిళా కానిస్టేబుళ్ళను నియమించాలని. అన్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పెన్నానదిలో స్నానఘట్టం వద్ద గజఈతగాళ్ళను ఏర్పాటుచేయాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు సరైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ, ధర్మాదాయశాఖ అసిస్టెంట్ కమీషనర్ వేగూరు రవీంద్రరెడ్డి, ఆలయఛైర్మెన్ పత్తి రవీంద్రబాబు, కార్యనిర్వహణాధికారి పాయసం నాగేశ్వరరావు, నగర డీఎస్పీ వెంకటనాథ్‌రెడ్డి, కార్పొరేషన్ ఆరోగ్య శాఖాధికారి సుబ్బరాజు, ఆనం రంగ మయూర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీ తల్పగిరి రంఘనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 27వతేదీ బంగారుగరుడసేవ, 28వతేదీ కళ్యాణోత్సవం, 29వతేదీ రథోత్సవం, 2వతేదీ తెప్పోత్సవం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించనున్నారు.

## విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ ప్రారంభం

విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ 28వ శాఖను నగరంలోని రేబాల వారి వీధిలో జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోఆపరేటివ్ బ్యాంక్‌లో కస్టమర్లకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు అందుబాటులోనికి తీసుకురావడం అభినందనీయమన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించి దినదినాభివృద్ధి చెందాలని కోరారు. బ్యాంకు అధ్యక్షుడు మానం ఆంజనేయులు మాట్లాడుతూ సహకార సంఘం, ఆర్‌బిఐ నియమనిబంధనలకు అనుగుణంగా బ్యాంకు పని చేస్తుందన్నారు. పేద మధ్య తరగతి ప్రజలకు ఆర్థికసాయం అందించే లక్ష్యంగా ప్రస్తుతం 1490కోట్ల రూపాయల పైబడి డిపాజిట్లు, 1060కోట్ల రుణాలు పంపిణీచేసి ప్రజలకు సేవలందిస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఉపాధ్యక్షులు గుడివాడ భాస్కరరావు, చలసాని రాఘవేంద్రరావు, ఎస్.సుబ్బారావు, నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.



బ్యాంకును ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్

PDF Compressor Free Version



మార్కులు సాధించడం కాదు...

# రిమార్కులు లేకుండా ఎదగండి!

## సరస్వతినిధి విద్యార్థులతో కలెక్టర్ ఆత్మీయసమావేశం



సింహపురి సమాచారం

చదువులో ఎన్ని మార్కులు సంపాదించుకున్నామా అనేది ముఖ్యం కాదు... జీవితంలో ఎలాంటి రిమార్కులు లేకుండా మీరు రాణించాలి. ఉన్నత స్థానాలు అధిరోహించాలి అని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ ఉద్బోధించారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని గోల్డెన్‌జూబ్లీ హాల్‌లో 'సరస్వతినిధి' సాయంతో నారాయణ, శ్రీచైతన్య వంటి కార్పొరేట్ కళాశాలల్లో చేరి ఇంటర్ మొదటిసంవత్సరం పరీక్షలను విజయవంతంగా వ్రాసిన విద్యార్థులతో ఆయన ముఖాముఖీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ వారితో ఎంతో కలుపుగోలుగా మాట్లాడారు. సరస్వతినిధికి మీరే పునాదులు. మీరు సాధించే విజయాలే సరస్వతినిధికి విరాళాలిచ్చిన దాతలకు జ్ఞాపికలవుతాయి. మరింతమంది దాతలు ముందుకొస్తారు. సరస్వతినిధికి విరాళాలిస్తారు. మీలాగే ఎంతోమంది పేద విద్యార్థులు చదువుకోగలరని అన్నారు. నేను కూడా ప్రభుత్వబడిలోనే, తెలుగుమీడియంలోనే చదివాను. చదువుకు అంతం లేదు. మీరు ఎంతైనా చదవండి... నా పూర్తి సహాయ సహకారాలుంటాయని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినులు కూడా మాట్లాడారు. మీ ఆశయాన్ని, ఆలోచనను మేము వృథాకానివ్వం సార్... మీరు మాకు చేసిన సాయానికి మేం సాధించే విజయాలే మీకు గురుదక్షిణగా వుంటాయని ఉద్వేగంగా చెప్పారు. ఇదొక మంచి ఆత్మీయసమావేశంలాగా జరిగింది. కలెక్టర్ అన్న బెరుకు తొణుకు లేకుండా విద్యార్థినులు ఆయనను తమ సొంత అన్న మాదిరిగా తమ భావాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ బి.రామిరెడ్డి కూడా పాల్గొన్నారు.

# ఏఆర్ ఏఎస్‌పిగా మూర్తి

జిల్లా ఏఆర్ ఏఎస్‌పిగా ఐఆర్‌ఎస్ మూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మూర్తి అంతకుముందు ఖమ్మం ఏఆర్ ఏఎస్‌పిగా పనిచేస్తూ ఇటీవల జరిగిన బదిలీలలో భాగంగా హైదరాబాద్‌లో వీఆర్‌లో వున్నారు. ఇక్కడ ఏఆర్ ఏఎస్‌పిగా పనిచేస్తున్న ఏసి నాగేశ్వరరావును ఖమ్మం ఏఆర్ ఏఎస్‌పిగా బదిలీ చేయడం జరిగింది. ఈ బదిలీ వెనుక రాజకీయ కోణం వుందనే వార్తలు వస్తున్నాయి. ఏసి నాగేశ్వరరావు మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి సన్నిహితుడు. ఈ సన్నిహితం వల్లే గతంలో నాగేశ్వరరావు జిల్లా ఏఎస్‌పిగా కూడా బాధ్యతలు నిర్వహించారు. చాలాకాలం నుంచి ఆయన నెల్లూరులోనే విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఇటీవల మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఓ టెలివిజన్ ఛానెల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో డిజిపి వి.దినేష్‌రెడ్డి పనితీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తాడు. టీవీలో ఆనం ఇంటర్వ్యూ వచ్చిన పక్కరోజే ఏసి నాగేశ్వరరావు బదిలీ కావడం విశేషం. ఆనం మీద కోపంతోనే డిజిపి ఈ బదిలీ చేసినట్లుగా తెలుస్తుంది.

# 'కలర్స్'ఫుల్‌గా రెయిన్‌బో వార్షికోత్సవం



రెయిన్‌బో విద్యార్థుల సాంప్రదాయ నృత్యప్రదర్శన

విద్యార్థుల్లోని సృజనాత్మకతను గుర్తించి వారిని ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం నెల్లూరులోని అనిల్‌గార్డెన్స్‌లో కలర్స్ 2013 పేరుతో నిర్వహించిన రెయిన్‌బో స్కూలు వార్షికోత్సవంలో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థుల అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమాన బాధ్యతను స్వీకరించాలన్నారు. ఈ సందర్భంగా కేవలం విద్యకే పరిమితం కాకుండా అన్ని రంగాల్లో రాణించేందుకు విద్యార్థులకు శిక్షణయిస్తున్న పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. చిన్నారులు నృత్య ప్రదర్శనలతో అందరినీ ఆకట్టుకున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల సంస్కృతులను ప్రతిబింబిస్తూ విద్యార్థులు చేసిన నృత్యప్రదర్శనలు కనులవిందుగా సాగాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పద్మాసుబ్రహ్మణ్యం, డ్వామా పిడి గౌతమి, నెల్లూరు ఆర్డీఓ మాధవీలత, ప్రిన్సిపాల్ అరుణస్వయంప్రభ విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అంబరాన్నంటిన అభిమానం...

# అందరివాడికి ఆత్మీయఅవార్డు ప్రదానం



వేదికపై ఆశీనులైన అతిథులు అతిరథులు

(మొదటిపేజీ తరువాయి)

హైదరాబాదు నుండి ఈ కార్యక్రమం కోసం ప్రత్యేకంగా విచ్చేసిన సినీ నిర్మాత చిల్లర కళ్యాణ్, సినీ హాస్యనటులు గుండు హనుమంతరావు, రాజబాబు సోదరుడు అనంత్‌లతో పాటు ప్రముఖ విద్యావేత్త రత్నం విద్యాసంస్థల అధినేత కె.వి.రత్నం, వాత్సల్య సేవాసంస్థ ఛైర్మెన్ సామంతు గోపాలరెడ్డి, టౌన్‌హాల్ కార్యదర్శి ఎ.వి. కృష్ణారెడ్డి, ప్రముఖదాత, జె.కె.రెడ్డి సోదరుడు జె.యస్.రెడ్డి, కస్తూరిదేవి విద్యాసంస్థల సెక్రెటరి మరియు కరస్పాండెంట్ జె.వి.రెడ్డి, వాస్తు రామచంద్రరావు, వీరిశెట్టి హజరత్‌బాబు, దేవరాల సుబ్రహ్మణ్యం యాదవ్, వేమారెడ్డి శ్యాంసుందరరెడ్డి, డా॥ మండువ శ్రీధర్, ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, కొండా బలరామిరెడ్డి, బట్టేపాటి నరేంద్ర రెడ్డి, "లాయర్" సంగ్రహకుడు తుంగా శివప్రభాత్‌రెడ్డి వేదికపై అతిథులుగా పాల్గొన్న ఈ సత్కార కార్యక్రమానికి అమరావతి కృష్ణారెడ్డి అధ్యక్షత వహించాడు.



కన్నతల్లి కామేశ్వరమ్మ, సోదరులు జె.యస్.రెడ్డి, జె.యస్.ఎన్.రెడ్డి, భార్య సులోచన, మనుమరాలు ప్రియదర్శినితో జె.కె.రెడ్డి



సభాకార్యక్రమానికి ముందు నటరాజుకు నీరాజనం

హరివిల్లు సంస్థ అధినేత దోర్నాల హరిబాబు వ్యాఖ్యానంతో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు సభస్థాయికి తగ్గట్లు లేకపోగా అధ్యక్షుడి అర్థరహిత ఉపన్యాసం సభికులకు విసుగు కలిగించింది. కేవలం జె.కె.రెడ్డిపై వున్న అభిమానంతో వచ్చిన ఆహూతులు సభ చివరి వరకూ వుండి మనస్ఫూర్తిగా తమ ఆప్తుడు జె.కె.ని సత్కరించుకుని వెనుదిరిగారు. దాదాపుగా గంటన్నర పాటు జె.కె.రెడ్డి సత్కార కార్యక్రమం కొనసాగిందంటే ఆయన సంపాదించుకున్న అభిమానం ఏ స్థాయిదో మనం వూహించుకోవచ్చు.

ఈ కార్యక్రమం మొత్తంలో ఉపన్యాసాలు కూడా పెద్దగా ఎవరినీ ఆకట్టుకోలేకపోవడం బాధాకరం. జె.కె.రెడ్డిని గురించి నారాయణ మెడికల్ కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ సుబ్రహ్మణ్యం, డీసీసీబీ మాజీఛైర్మెన్ వేమారెడ్డి శ్యాంసుందరరెడ్డిలు మాత్రమే సముచిత రీతిలో చెప్పగలిగారు. ప్రతి ఉపన్యాసానికి ముందూ వెనుకా అధ్యక్షుడి ప్రసంగం అప్రస్తుతం, అర్థరహితం, అనవసరం అనిపించింది.

## అవార్డుకే ఆకర్షణ

"హరివిల్లు క్రియేషన్స్" పుట్టింది 3సంవత్సరాల క్రితమే. వ్యక్తులను ఎంపికచేసి జీవితసాఫల్య పురస్కారాలను అందించడానికి హరివిల్లుకున్న అర్హతను కూడా ఇక్కడ పలువురు ప్రశ్నించడం కనిపించింది. ఎవరు చేసినా జరిగే సన్మానం జె.కె.రెడ్డిది కాబట్టి, అంతటి మహానుభావుడిని సత్కరించుకొనే అవకాశం తమకు లభించిందని చాలా మంది నోట వినిపించింది. కార్యక్రమం మొత్తంలో జె.కనే హైలెట్‌గా నిలిచారు. హరిబాబు మంచి భవిష్యత్తు కలిగిన కళాకారుడు, భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకునే అవకాశాలు అతనికి మెండుగా వున్నాయి. తన "హరివిల్లు" అనే గొడుగు క్రింద కళారంగానికి సేవలందిస్తూ తన సంస్థ ద్వారా మరికొంతమంది కళాకారులకు అండగా నిలిస్తే బాగుంటుంది. తాను ఇంకొకరి అడుగులకు మడుగులొత్తుతూ వారి నీడలో తానున్నాననే భావన ప్రజలకు కలిగేలా కార్యక్రమాలను నిర్వహించడం అతనికే నష్టం.

జె.కె.రెడ్డి స్థాయిలాంటి వ్యక్తులకు అవార్డులను అందించి తన సంస్థ ఇమేజ్‌ని పెంచుకునే ప్రయత్నం చేయడంలో తప్పులేదు కానీ, కార్యక్రమ నిర్వహణలో అనర్హుల్ని అందలమెక్కించి లాభం కంటే నష్టాన్నే ఎక్కువగా మూటకట్టుకుంటున్నాడు హరిబాబు. ఇప్పటికైనా మేల్కొని భవిష్యత్‌లో తన సంస్థని రంగుల హరివిల్లుగా మారుస్తాడని ఆశిద్దాం! ఈ విషయాలు కొందరికి కష్టం కలిగించొచ్చు కాని వాస్తవాలు కఠినంగానే వుంటాయి. నిజాలు నిప్పులాంటివి!

గుండెల నిండా అభిమానంతో తన కోసం తరలివచ్చే వేలాది మంది మదులను దోచుకున్న జె.కె.రెడ్డి ధన్యజీవే కాదు పుణ్యజీవి కూడా! ఆయనకు 'లాయర్' అభినందనలు.



కుమార్తె పద్మ మరియు ఇతర బంధువర్గంతో జె.కె.దంపతులు



ఆత్మీయుడి అవార్డు సభకు తరలివచ్చిన అభిమానులు

PDF Compressor Free Version



# కదంబం

## 'మమ'

కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్
మార్కాపురం. 94402 11120

శబ్ద ఘాతాల మధ్య
వాహనాల రణగొణల మధ్య
ట్రాఫిక్ రొదల మధ్య
బిక్క చిక్కిన కవితాగానం అది
కవన కుతూహలుల హావభావాల
మూకీ సినిమా నడుస్తోందక్కడ
అడవిలో వెన్నెల కాచినట్టు...
మురిక్కాలువలో మల్లెలు కొట్టుకుపోతున్నట్టు...
ఆరోజు తెలుగు ప్రాంగణంలో
సాహితీ సుందరి సొక్కి పోతున్నది
వేదిక ముందు నిండుదనం కోసం
పిలుచుకున్న బడిపిల్లల కాకిగోల
విరామం లేకుండా ఎక్కే కవి, దిగే కవి
అంకం ముగిసిన ఆనవాలుగా
అప్పుడప్పుడు చెదురుమదురు చప్పట్ల తుంపర
కాలుష్యపు ధ్వనిలో
గిరికీలు కొట్టే కవి తిక్కన్నలు
చెవుల్లో ఎంచక్కా గోడలు కట్టుకున్న
తెలివైన శ్రోతల పిచ్చాపాటి
మరోవైపు
ఏవో కాసిన్ని మాటల్ని, దృశ్యాల్ని
టెక్నాలజీ పెట్టెల్లో భద్రంగా పట్టుకుపోయే
మీడియా ప్రతినిధులు, హైరానా పాత్రికేయులు
ఆదేశాల మేరకు కదిలే
అధికార గణాల భీభత్సపు హడావిడి
అంతా లాంఛనంగా జరిగే తంతు
మర్నాటి వార్త కోసం - మహాశయుల మెప్పు కోసం
చేటంత కళ్ళతో నిర్వాహకుల నిరీక్షణ
వెరసి - ఒక
తెలుగు తకుకుల మూషిక సమ్మేళనం

(ఒక 'తెలుగు భాషోత్సవాన్ని' తిలకించిన దుఃఖంలో)

## ఉగాది కవితలకాహ్వానం

రానున్న విజయనామ సంవత్సర ఉగాది వేడుకలలో భాగంగా ఏప్రిల్ 11న జిల్లా సాంస్కృతిక శాఖ నిర్వహించే కవిసమ్మేళనంలో పాల్గొనగోరే ఔత్సాహికకవుల నుంచి నెల్లూరుజిల్లా పౌరసంబంధాల శాఖాధికారి యం.కమలాకర్‌రెడ్డి కవితలను ఆహ్వానిస్తున్నారు. పద్య, వచన కవితలు రెండింటి పఠనముంటోందని, వచన కవిత 20 పంక్తులు మించకుండా ఏ4 సైజు తెల్లకాగితంపై డి.టి.పి చేయించిన కాపీని మాత్రమే పంపమని కోరారు. గతంలో ప్రచురించబడని, చదవని కవితలతో పాటు కవి బయోడేటా జతపరచి పంపాలి. ఉత్తమ కవితలు గుర్తించి ఫోన్ ద్వారా తెలుపుతామని, ఎంపికైన వారు కవిసమ్మేళనంలో పాల్గొనాలని తెలిపారు. కవితలను జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్, నెల్లూరు చిరునామాకు పంపాలని, కవితా శీర్షిక 'తెలుగుసంస్కృతిపై ఉగాది కవితావాణి' అని వ్రాయాలని తెలిపారు.

## జనహితలో స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

నెల్లూరు కొండాయపాళెంరోడ్డులోని జనహిత -వాత్సల్య సంస్థ ప్రాంగణంలో ఏప్రిల్ 7నుంచి 10వరకు విద్యార్థులకు క్రీడా పోటీలు జరుగుతాయని భారతీయ విద్యావికాస్ ఇంగ్లీషు మీడియం హైస్కూలు ప్రధానోపాధ్యాయులు ఎం.మధుసూదన్‌రెడ్డి తెలిపారు. కబడ్డీ, క్రికెట్, చదరంగం, ఖోఖో, ఆటల్లో పోటీలు నిర్వహిస్తామని ఏప్రిల్ 7వతేది ఉదయం 8.30గం॥లకు వదాన్యులు, ప్రఖ్యాత పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి 'స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్'ను ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో నగరంలోని పాఠశాలల విద్యార్థులు పాల్గొనమని ఆహ్వానిస్తున్నారు. వివరాల కోసం 95815 77968, 90525 75407నంబర్లలో సంప్రదించవచ్చున్నారు.

# ఎమ్మెల్యేల విరాళాలతో కరెన్సీ ప్రింటింగ్ మిషన్

శ్రీను గల్పిక

అది బాంబుపేలుళ్ల రహిత నగరంగా ఐఎస్ఐ గుర్తింపు పొందిన భాగ్యనగరం. బేగంపేటలోని డబ్బులశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి నివాసం. రామనారాయణరెడ్డి ఇంట్లో భారీఎత్తున లక్ష్మీపూజ నిర్వహించాడు. ఆరోజు అసెంబ్లీలో వార్షికబడ్జెట్ ప్రవేశపెట్టనుండడంతో ముందుగా అనారోగ్యంతో తన ఇంట్లోనే వుంటున్న తన అన్న స్టైల్ ఆఫ్ సింహపురి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే ఆనం వివేకానంద రెడ్డి(63+) ఆశీస్సుల కోసం వెళ్లాడు. తన వద్ద కొచ్చిన రామనారాయణనుద్దేశించి... "నారాయణ, బడ్జెట్ చాలాబాగుండాలి. సిగరెట్ ధరలు తగ్గేలా చూడు... నాలాంటి మధ్యతరగతి ప్రజలందరికీ సిగరెట్లు అందుబాటులో వుండాలి. అలాగే సినిమా టికెట్ల ధరలు తగ్గించేలా చూడు. అప్పుడు ప్రేక్షకులు ఒక్కో సినిమాను రెండేసిసార్లు చూడగలరు. నేను కూడా ప్రతిరోజూ సెకండ్‌షోకే కాకుండా ఫస్ట్‌షోక్కూడా పోవచ్చు. అలాగే అత్తర్లు, పౌడర్ల మీద కూడా టాక్సులు తగ్గించేలా చూడు. వాటిని నేను ఎక్కువగా కొంటుంటాను" అని వివేకా చెప్పాడు. అంతా విన్న రామనారాయణ అలాగే చేస్తానని చెప్పి అక్కడ నుండి అసెంబ్లీకి బయలుదేరాడు.

★★★★★

అసెంబ్లీ భవనం. శాసనసభ్యులు ఒక్కొక్కరుగా వస్తున్నారు. ప్రతిపక్ష నేత చంద్రబాబు వచ్చాడు. ఆయన భుజంమీద పసుపు కండువాతో పాటు కాంగ్రెస్ కండువా కూడా వుంది. ఆయన భుజం మీదే కాదు తెలుగుదేశం ఎమ్మెల్యేలందరి భుజాల మీద రెండు పార్టీల కండువాలు కంబైన్డ్‌గా వున్నాయి. అది చూసి లోక్‌సత్తా కన్వీనర్ జయప్రకాశ్‌నారాయణకు మతిపోయినంత పనైంది... అదేంటి చంద్రబాబు గారు... మీరు కాంగ్రెస్ కండువాను వేసుకున్నారని అడిగారు. దానికి చంద్రబాబు... ఇప్పటికి ఈ రెండు కండువాలే... రేపు జగన్‌ను ఎదుర్కోవడానికి అవసరమైతే సీపీఎం, సీపీఐ, బీఎస్పీ, టీజేపీ, టీఆర్ఎస్ కండువాలను కూడా భుజం మీద వేసుకోవడానికి సిద్ధం... అని చెప్పాడు. అంతలో అక్కడకు కిరణ్‌కుమార్‌రెడ్డి, మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేలు వచ్చారు. వారి భుజాల మీద కూడా కాంగ్రెస్ కండువాలతో పాటు తెలుగుదేశం కండువాలు వున్నాయి. అప్పుడు జయప్రకాశ్ నారాయణకు సబ్జెక్ట్ పూర్తిగా అర్థమైంది. సహకార ఎన్నికలప్పటి నుండి మీ రెండుపార్టీల మధ్య పరస్పర సహకారం ఎక్కువైందంటూ ఆయన లోపలకు వెళ్లాడు. సభ లోపలకు టీఆర్ఎస్, బీజేపీ, సీపీఎం, సీపీఐ, ఎంఐఎం ఎమ్మెల్యేలు పార్టీల వారీగా పోగా కాంగ్రెస్, తెలుగుదేశం ఎమ్మెల్యేలు మాత్రం ఒక గ్రూపుగా వెళ్లారు.

స్పీకర్ నాదెండ్ల భాస్కర్‌రావు సభను ప్రారంభిస్తూ... ఈరోజు బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నాం కాబట్టి సభను సజావుగా సాగనివ్వాల్సి వుంటుంది. మీరు తన్నుకోవడం, పేపర్లు చించి విసిరేయడం, మైకులను విరగ్గొట్టడం, బెంచీలు ఎక్కి దరువేయడం వంటివి కుదరదు. ఈ అసోకర్యానికి చింతిస్తున్నాను... ఒక్కరోజు ఓపిక పట్టండి... రేపట్నుండి మళ్లీ మీ ఇష్టం అని వేడుకున్నాడు. సభ్యులంతా ఆయన మీద జాలి, దయతో అలాగేనని ఒప్పుకున్నారు.

ఆ తర్వాత ఆనం రామనారాయణరెడ్డి బడ్జెట్ ప్రసంగం మొదలైంది. ఈ ఏడాది వార్షిక బడ్జెట్ 1,61,000కోట్లు. జలయజ్ఞంలో మొదలు పెట్టిన ప్రాజెక్టుల పూతపనులకు 20వేల కోట్లు, విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణానికి 10వేల కోట్లు, వైద్య ఆరోగ్యశాఖకు పాతిక వేల కోట్లు, ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు 5వేల కోట్లు, గ్రామీణాభివృద్ధికి వెయ్యికోట్లు, పట్టణాభివృద్ధికి 2వేల కోట్లు, ప్రతి గ్రామంలో తాగునీటి పథకానికి 10వేల కోట్లు, చిన్నపరిశ్రమల అభివృద్ధికి 10వేల కోట్లు, పెద్దపరిశ్రమల అభివృద్ధికి 5వేలకోట్లు, కార్మికులకు భద్రత కల్పించే పథకానికి 7వేల కోట్లు, మహిళల పావలావడ్డీ ఋణాలకు 12వేల కోట్లు... రామనారాయణరెడ్డి ఇలా అన్ని కేటాయింపులను వేలకోట్లలో చెబుతూ అరచేతిలో వైకుంఠం చూపించాడు. తర్వాత వ్యవసాయశాఖ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ ప్రత్యేకంగా వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ... రైతులందరికీ కరెంట్ ఫ్రీ అని అన్నాడు. అప్పుడు బీజేపీ నేత కిషన్‌రెడ్డి లేచి... అసలు రాష్ట్రంలో కరెంట్ లేనప్పుడు ఫ్రీగా ఇస్తే ఏంటి, ఇవ్వకుంటే ఏంటి? అని ప్రశ్నించాడు. దానికి స్పీకర్ నాదెండ్ల కలుగజేసుకుని... కిషన్‌రెడ్డి గారు... బడ్జెట్ చదివేటప్పుడు మధ్యలో అడ్డం తగలొద్దు... అయినా అందరికీ తెలిసిన విషయం గురించి మీరెందుకు రచ్చచేస్తారని కూర్చోబెట్టాడు. తిరిగి కన్నా చదవసాగాడు. రైతులకు సగం సబ్సిడీకి విత్తనాలు, పంట చేతికి రాక ఆత్మహత్యలు చేసుకోవాలనుకునే రైతులకు పూర్తి సబ్సిడీతో పురుగుమందులు, ప్రతిరైతుకూ ఓ ట్రాక్టర్... దాన్ని నడపడానికి ఫ్రీగా డీజిల్, ప్రతి రైతు కుటుంబానికి ఓ కంప్యూటర్, దానికి ఇంటర్నెట్ అనుసంధానం, ప్రతి రైతుకు బ్యాంకుల నుండి తిరిగి చెల్లించనవసరం లేని ఋణాలను ఇప్పిస్తాము. సాగునీటి ప్రాజెక్టులకు 2వేల కోట్లు, కొత్తగా కాలువల నిర్మాణానికి 3వేల కోట్లు, విత్తనాలు, ఎరువుల సబ్సిడీ క్రింద వెయ్యికోట్లు... అని కన్నా చెబుతూ ముగించి కూర్చున్నాడు. అప్పుడు చంద్రబాబు చప్పట్లు తడుతూ లేచి... ఇది సూపర్ బడ్జెట్, నా రాజకీయ జీవితంలోనే ఇంతమంచి బడ్జెట్‌ను చూడలేదు. ప్రతి ఏటా మనం ఇంత మంచి బడ్జెట్‌లను చూడాలంటే ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కాపాడుకోవాల్సిందేనని చెప్పాడు. లోక్‌సత్తా కన్వీనర్ జయప్రకాశ్ నారాయణ లేచి... అధ్యక్షా! ఈ బడ్జెట్‌లో అంకెలు చాలా ఆకర్షణీయంగా వున్నాయి. కరెంట్ బిల్లు కట్టే దిక్కులేక సీఎం ఛాంబర్‌కే కరెంట్ కట్ చేసే పరిస్థితి వుంది. రాష్ట్ర ప్రభుత్వం తరపున సచివాలయంలోని టీ క్యాంటీన్‌లో చేసిన అప్పులకే డబ్బులు లేవు. మరి ఇన్ని లక్షల కోట్లు ఎక్కడనుండి తెస్తారు అని ప్రశ్నించాడు. ఆ మాట జేపీ నోట రాగానే సీఎం కిరణ్, ఆర్థికమంత్రి ఆనం చెరొక డబ్బా చేతిలో పెట్టుకుని లేచారు. సీఎం కిరణ్ వుండి... మీరంతా దయవుంచి ఈ డబ్బాలలో తలా పదివేల రూపాయలు వేస్తే, వచ్చిన ఆ విరాళాలతో కలర్‌ప్రింటింగ్‌మిషన్ కొంటాం. ఆ మిషన్ ద్వారానే ఈ బడ్జెట్‌లో చెప్పిన లక్షల కోట్ల కరెన్సీని ముద్రించబోతున్నాం అని చెప్పాడు. ఆ మాటతో జేపీనే కాదు, సభలోవున్న వారంతా అవాక్కయ్యారు.

★★★★★

## జిల్లా ప్రజా వాకర్స్ సంఘం ఉచిత వైద్య శిబిరం

నెల్లూరు పొదలకూరురోడ్డులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 24న జిల్లా ప్రజా వాకర్స్ సంఘం నిర్వహణలో ఉచిత యోగా వైద్యశిబిరం జరుగనున్నట్లు వాకర్స్ సంఘం అధ్యక్షులు చలంచర్ల భాస్కర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మండువ శ్రీనివాసరావులు తెలిపారు. దొడ్ల సుబ్బారెడ్డి ప్రభుత్వ జిల్లా కేంద్ర వైద్యాలయం, ఐయస్ఐ హాస్పిటల్, నెల్లూరు హాస్పిటల్‌లకు చెందిన వైద్యనిపుణులు ఈ శిబిరంలో ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారని నెల్లూరు ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని వారు కోరుతున్నారు.

### సార్క్ దేశాల కవితా సంకలనంలో

## సరోజాదేవి కవితలు

నెల్లూరు నారాయణ కళాశాలలో ఆంగ్లశాఖాధిపతిగా విధులు నిర్వర్తిస్తున్న డా॥ సరోజాదేవి రచించిన పది కవితలు సార్క్ దేశాల కవితలతో రూపొందించిన కవితా సంకలనంలో ప్రచురితం కావడం సింహపురికే గర్వకారణం. ఈ సందర్భంగా ఈ కవితలను ముద్రించిన సంకలనాన్ని సరోజాదేవి ప్రదర్శించారు.

## నెరసం నూతన కార్యవర్గం

నెల్లూరు టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో ఈనెల 17న జరిగిన నెల్లూరు జిల్లా రచయితల సంఘం సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎ.జయప్రకాష్, ప్రధాన కార్యదర్శిగా మాటేటి రత్న ప్రసాద్, ఉపాధ్యక్షులుగా వాయుగండ్ల శశికళ, కోశాధికారిగా సింగరాజు శ్రీనివాసకుమార్, సహాయ కార్యదర్శిగా ములుగు లక్ష్మీమైథిలి కార్యవర్గ సభ్యులుగా ఊరుబిండి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి, కిరణశ్రీ, పట్టెం వేణుగోపాల్ రెడ్డి, డి.టి.హరికృష్ణలు ఎన్నికయ్యారు.

## 'పినాకిని' ఉచిత వైద్య శిబిరం



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న జేసీ లక్ష్మీకాంతం, డి అండ్ హెచ్‌ఓ డా॥ మాశిలామణి

నెల్లూరు మూలాపేటలోని ఇరుకళల పరమేశ్వరి ఆలయం ఆవరణంలో ఇటీవల పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వీసుల శాఖ సహకారంతో ఉచిత వైద్యశిబిరం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అదనపు కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డా॥ కె.మాశిలామణి, జిల్లా యువజన సర్వీసులశాఖ ముఖ్య కార్యనిర్వహణాధికారి యం.వి.సుధాకర్‌లు విచ్చేయగా, డాక్టర్లు డి.మధుసూదన్, పి.విజయ్‌కుమార్, పావులూరి మాధవ్, జి.ఎ.అన్నపూర్ణ, యం.డి.నిజాం, పియంపి రాష్ట్ర కోశాధికారి శాఖవరపు వేణుగోపాల్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.మురళీ మోహన్‌రాజులు పాల్గొని వైద్యశిబిరం విజయవంతంగా నిర్వహించారు.

PDF Compressor Free Version



## మేషం

ఉద్యోగులకు ప్రమోషన్లు, స్థానమార్పులకు అవకాశాలుండి బాధ్యతలు పెరుగుతాయి. అధికారిక పర్యటనలుంటాయి. క్రొత్త పెట్టుబడులు కొంత ఆగి ప్రయత్నించడం మంచిది. ప్రలోభాలకు, ఒత్తిడులకు లొంగి హామీలు సంతకాలు చేయకండి. కుటుంబసభ్యుల మధ్య అవగాహన, అనురాగాలుంటాయి. స్త్రీలకు అనారోగ్య బాధలుంటాయి.

అశ్వని, భరణి, కృత్తిక 1 పాదము

## వృషభం

విద్యార్థులకు విద్యాశ్రమ ఎక్కువగా ఉంటుంది. ఉద్యోగులకు అధికారులతో సత్సంబంధాలు, అదనపు బాధ్యతలుంటాయి. సభలు సమావేశాలలో ప్రముఖంగా వ్యవహరిస్తారు. వ్యాపార భాగస్వామిక ఒప్పందాలలో సముచిత నిర్ణయాలు చేసుకొంటారు. గృహ రిపేర్లు, వస్తు వాహన రిపేర్లుంటాయి. ప్రభుత్వ అనుమతులు లభించగలవు. షేర్లు పెట్టుబడులపై లాభాలుంటాయి.

కృత్తిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

## మిధునం

ఉద్యోగ నిర్వహణలో పొరపాట్లు రాకుండా చూచుకొనండి. చిరకాల బంధుమిత్రులను, ప్రముఖులను కలుసుకొంటారు. దూరప్రయాణాలుంటాయి. బిడ్డల యొక్క అనారోగ్య, విద్యాపరమైన సమస్యలు బాధిస్తాయి. శాస్త్ర, సాంకేతిక రంగాలలో పరిశోధనావకాశాలు బాగుంటాయి. వృత్తిపరంగా వ్యాపకం, ఆదాయం బాగుంటుంది. విద్యార్థులు మరింత కష్టపడాలి.

మృగశిర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

## కర్కాటకం

వ్యవహారాలలో, అగ్రిమెంట్ల విషయంలో ఖచ్చితంగా ఉండండి. విద్యార్థులకు చదువుపై శ్రద్ధ, ఉద్యోగులకు విధినిర్వహణలో సామర్థ్యం బాగుంటుంది. వ్యాపార పరంగా స్తబ్ధత చోటుచేసు కొంటుంది. వ్యాపార వర్గాలకు ఆదాయం తగ్గుతుంది. వైద్య, న్యాయ, చిన్న పరిశ్రమల వారికి అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అవసరాలకు కొద్దిపాటి ఋణం చేయవలసి వస్తుంది.

పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

## సింహం

వృత్తివ్యాపారాలలో స్వల్ప లాభాలుంటాయి. ప్రముఖుల పరిచయాలతో అనుకున్న పనులు నెరవేర్చుకొనడం, స్థిరాస్తులు, ఇల్లు, స్థలాలు ఏర్పరచుకొనే ఆలోచనలు కలుగుతాయి. ఖర్చులు పెరుగుతాయి. అయితే ఆదాయానికి లోటుండి. క్రొత్త పెట్టుబడులు, భాగస్వామ్యాలకు అవకాశాలు దొరుకుతాయి. క్రొత్త కాంట్రాక్టులు లభించగలవు.

మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

## కన్య

ఉద్యోగులు తమ అధికారులతోనూ పబ్లిక్‌తోనూ జాగ్రత్తగా వ్యవహరించాలి. సమావేశాలందు ముఖ్య బాధ్యతలు నిర్వహిస్తారు. సలహాలు, హామీలు ఇచ్చి చిక్కులలో పడే అవకాశం ఉన్నది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. సమస్యలను జాగ్రత్తగా పరిష్కరించే శక్తి ఉంటుంది. ఈ రాశి వారికి ఆదాయ వ్యయాలు సరిపోతుంటాయి.

ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి - మీ వాసి

తేది. 22.03.2013 నుండి
తేది. 28.03.2013 వరకు

ఈవారం మీనంలో శక్రు రవి కుజాలు, మేషంలో కేతు, వృషభంలో గురువు, కర్కాటక సింహ కన్యలో చంద్రుడు, తులలో శనిరాహువులు, కుంభంలో బుధుడు సంచరిస్తారు.

### పంచాంగము :

శుక్ర మౌఢ్యమి జరుగుచున్నది.

### ఫాల్గుణమాస శుక్లపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 22 | శుక్ర | దశమి | మ॥ గం.1.49వ॥ |
| తేది. 23 | శని | ఏకాదశి | సా॥ గం.3.0వ॥ |
| తేది. 24 | ఆది | ద్వాదశి | సా॥ గం.4.0వ॥ |
| తేది. 25 | సోమ | త్రయోదశి | సా॥ గం.4.18వ॥ |
| తేది. 26 | మంగళ | చతుర్దశి | సా॥ గం. 4.08వ॥ |
| తేది. 27 | బుధ | పూర్ణిమ | సా॥ గం.3.26వ॥ |
| తేది. 28 | గురు | పాడ్యమి | సా॥ గం.2.17వ॥ |

## తుల

ఉద్యోగులకు అదనపు పనిభారం ఉండి అధికారుల సహకారం బాగుంటుంది. కుటుంబసభ్యులతో అనుకూలత తక్కువగా ఉంటుంది. క్రొత్త వస్తువులు కొనడం, గృహవాహన రిపేర్లుంటాయి. వృత్తిపరంగా విశ్రాంతి దొరకదు. వ్యాపారవర్గాలకు పరిస్థితులు స్తబ్దతతో ఉంటాయి. ఆదాయం ఖర్చులు సరిపోతుంటాయి. పనులందు ఆలోచనా రాహిత్యం, టెన్షన్ ఉంటుంది.

చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

## వృశ్చికం

పరస్పరతో యజమానులకు సమస్యలుండవచ్చును. ఏ పనైనా సమర్థవంతంగా నిర్వహించి సమస్యలను సర్దుబాటు చేసికొంటారు. ప్రజాసంబంధాలు కలవారు తటస్థంగా వుండటం మంచిది. ఉదరకోశ బాధలుండగలవు. ఆస్తుల క్రయవిక్రయాలలో తొందరపాటు వద్దు. సోదరులు, బంధువర్గంతో సర్దుబాటుతనం మంచిది. షేర్లు పెట్టుబడి రంగాలలో స్వల్పలాభాలుంటాయి.

విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

## ధనుస్సు

ఆదాయం పెరుగుతుంది. పిల్లల విద్యా ఉద్యోగ వివాహ విషయాలలో కొంత ఆందోళన ఉంటుంది. విద్యార్థులు మరింత కష్టపడవలసి ఉంటుంది. స్థిరాస్తుల లావాదేవీలందు తొందరపాటు వద్దు. సమస్యలు కలిగే అవకాశం ఉన్నది. కుటుంబసభ్యులకు అనారోగ్య బాధలుంటాయి. వ్యాపారవర్గాలకు విస్తరణ, అభివృద్ధి అవకాశాలు దొరుకుతాయి.

మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

## మకరం

ప్రమోషన్లు, ట్రాన్స్ఫర్ ప్రయత్నాలకు అభ్యంతరాలుండవచ్చును. బంధుమిత్రుల రాకపోకలు, తీర్థయాత్రల నిర్ణయాలు జరుగును. ఆరోగ్యం బాగుంటుంది. సంఘ సమావేశాలలో ప్రముఖస్థానం, గుర్తింపు లభిస్తుంది. పరీక్షలకు సన్నద్ధులై కృషి చేస్తారు. భూములు, స్థిరాస్తులు కొనుగోలు ప్రయత్నాలు జరుగగలవు. ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూల ఆదేశాలు అందుతాయి.

ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

## కుంభం

దూరప్రయాణాలు జరిగి, పనులు నెరవేరతాయి. ప్రభుత్వ అనుమతులు పొందగలరు. ఉద్యోగులకు అధికారులకు తమ పైఅధికారుల సహకారం, ఆదరణ ఉంటుంది. క్రొత్త పరిచయాలు, వ్యాపకాలు పెరుగుతాయి. వృత్తిపరంగా అభివృద్ధి, విజయాలు, ఆదాయం పెరగడం ఉంటుంది. తప్పిదాలు జరుగకుండా జాగ్రత్తగా వ్యవహరించండి.

ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

## మీనం

స్థిరాస్తుల లావాదేవీలు ఆపుకొనడం మంచిది. కోర్టు వ్యవహారాలు వాయిదా పడగలవు. స్థానమార్పులు, వస్తు వాహన రిపేర్లుంటాయి. వృత్తిపరంగా మంచి గుర్తింపు రాబడి ఉంటుంది. అనుకున్న పనులు నిదానంగా సాగుతాయి. సోదరులకు మేలు జరగవచ్చును. బంధు ముఖ్యుల అనారోగ్య వార్తలు వింటారు. శాస్త్ర సాంకేతిక క్రీడారంగాల వారికి అవకాశాలు దొరుకుతాయి.

పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

# అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి



అమరజీవికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

తన ప్రాణాలను తృణప్రాయంగా ఎంచి భాషాప్రయుక్త రాష్ట్రాల సాధనలో ఆంధ్రరాష్ట్రం ఏర్పాటుకు కృషి చేసి అమరుడయిన పొట్టిశ్రీరాములు 113వ జయంతి ఈనెల 16న నెల్లూరులో ఘనంగా జరిగింది. ఆర్యవైశ్య మహాసభ, అర్బన్ ఆర్య వైశ్య సంఘం తదితర సంఘాల సభ్యులు స్టోన్‌హౌస్‌పేటలోని వాసవీకన్యకాపరమేశ్వరీ దేవస్థానం నుంచి ఊరేగింపుగా వచ్చి ఆత్మకూరు బస్టాండు వద్ద పొట్టి శ్రీరాములు విగ్రహానికి గౌరవంగా పుష్పమాలలువేసి ఆయన త్యాగాన్ని కొనియాడారు. అర్బన్ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్, మాజీ అధ్యక్షుడు కోటగురుబ్రహ్మం, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర కార్యదర్శి కె.వి.చలమయ్య, చీఫ్ కోఆర్డినేటర్ తిరువీధి ప్రకాశరావు, సహస్ర సభాసింహం బి.వి. నరసింహం, వాసవి క్లబ్ విక్రమసింహపురి అధ్యక్షుడు సుగుణ కుమార్, ప్రధాన కార్యదర్శి కిషోర్ తదితరులు నివాళులర్పించారు.

నెల్లూరు స్టోన్‌హౌస్‌పేటలోని అన్నదానసమాజంలో అమరజీవి పొట్టి శ్రీరాములు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు కోట మధుసూదన్‌రావు సమదుస్తులను పంపిణీ చేసారు.

# జమా అతె ఇస్లామి హింద్ ఉచితవైద్య శిబిరం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నెల్లూరు పానగల్ రాజా రోడ్డులోని జమా అతె ఇస్లామి హింద్ కార్యాలయంలో ఈనెల 17న ఉచిత వైద్యశిబిరం జరిగింది. ఈ సందర్భంగా జమా అతె ఇస్లామి హింద్ నగర అధ్యక్షులు యం.డి.షహబుద్దీన్ మాట్లాడుతూ సంస్థ కులమత వ్యత్యాసం లేకుండా అందరికీ సేవలు అందిస్తుందని పేర్కొన్నారు. మనిషి, మనిషిగా ఎలా బ్రతకాలో వివరిస్తూ మనిషి రుజుమార్గంలో జీవించే విధానమే ఇస్లాం అని అన్నారు. వైద్యులు డా॥ శ్రీకృష్ణ, డా॥ విజయలక్ష్మి, డా॥ ఎస్.కిరణ్‌కుమార్‌లు ఈ శిబిరంలో దాదాపు 300మంది రోగులను పరీక్షించగా, జమాఅతెఇస్లామి హింద్ కార్యకర్తలు మందులు ఉచితంగా పంపిణీ చేసారు. నగర సంఘ సేవాకార్యదర్శి ఇలియాజ్‌ఖాన్, దస్తగిరి హజరత్, ఎస్‌కె.ఖాలీద్, రాషిద్, ఖమ్రుద్దీన్, సలీం ఉమర్, మునవ్వర్ మొదలగువారు పాల్గొన్నారు.


## పెళ్లి సంబంధాలు

### వధువు కావలెను

1. 1984 డిసెంబరు 24 జననం. ఎత్తు 5'6". చదువు యం.యస్.సి(ఎలెక్ట్రానిక్స్). జీతం రూ.25,000/-. ఉన్నతమైన రెడ్డి ఉద్యోగ కుటుంబం. ఆస్థి విలువ 1కోటి. స్వస్థలం నెల్లూరుజిల్లా. ఉద్యోగం ఐసిఐసి బ్యాంకు.
2. 1984 ఆగష్టు 13 జననం. ఎత్తు 5'10". చదువు బి.ఇ(కంప్యూటర్స్). యం.యస్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్(అమెరికా). ఆస్థి విలువ 20కోట్లు. వ్యాపారం కస్టమ్స్ ఏజెన్సీ. 2 1/2 లక్ష ఆదాయం. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం చిత్తూరుజిల్లా. ప్రస్తుత నివాసం మద్రాసు.
3. 1986 మార్చి 16 జననం. ఎత్తు 5'5". చదువు బిటెక్. యం.యస్(అమెరికా). ఉద్యోగం ఇన్‌టెల్ చిప్ డిజైనర్(పోర్ట్‌ల్యాండ్), అమెరికా. జీతం నెలకు రూ.4లక్షలు. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్థి విలువ 10కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
4. 1982 ఫిబ్రవరి 20 జననం. ఎత్తు 5'9". చదువు బి.టెక్(ఇఇఇ). యం.యస్.సి(ఐటి). యు.కె. ఉద్యోగం టీమ్‌లీడర్ (ప.పి.సొసైటి ఫర్‌నాలెడ్జ్‌మెంట్ వర్క్స్ ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజి) మినిస్ట్రీ ఆఫ్ ఐటి, హైదరాబాద్. జీతం నెలకు రూ.35,000/-. ఆస్థి విలువ 2కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
5. 1981 మే11 జననం. ఎత్తు 5'8". చదువు యం.బి.ఏ, జి.యమ్.ఐ.టి. ఉద్యోగం సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. సీనియర్ బిజినెస్ డెవలప్‌మెంట్ మేనేజర్. జీతం నెలకు రూ.80,000/-. ఆస్థి విలువ 41/2 కోటి. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.

### వరుడు కావలెను

6. 1991 జూన్ 18 జననం. ఎత్తు 5'5". చదువు బిటెక్(సి.యస్.సి). ఆస్థి వాటా 20లక్షలు. ఉన్నతమైన మధ్య తరగతి రెడ్డి ఉద్యోగ కుటుంబం. స్వస్థలం నెల్లూరుజిల్లా.
7. 1988 జూన్ 10 జననం. ఎత్తు 5'2". చదువు బి.డి.యస్. ఉన్నతమైన రెడ్డి వ్యవసాయ కుటుంబం. ఆస్థివాటా 3కోట్లు. స్వస్థలం నెల్లూరుజిల్లా.
8. 1983 ఫిబ్రవరి 27 జననం. ఎత్తు 5'6". చదువు బి.కాం. యం.యస్ ఇన్ కంప్యూటర్ లాంగ్వేజస్. ఇంటీరియర్ డిజైనింగ్. వ్యాపారం ఇంటీరియర్ డిజైనర్. ఆస్థి వాటా 9కోట్లు. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. స్వస్థలం నిజామాబాద్ జిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
9. 1982 జనవరి 12 జననం. ఎత్తు 5'4". చదువు యం.బి.బి.యస్. ఉన్నతమైన రెడ్డి వ్యాపార కుటుంబం. ఆస్థి విలువ 1 కోటి. స్వస్థలం నెల్లూరుజిల్లా. ప్రస్తుత నివాసం హైదరాబాద్.
10. 1987 మే 8 జననం. ఎత్తు 5'2". చదువు లా 2వ సం॥. యం.బి.ఏ (యూనివర్శిటీ ఆఫ్ జార్జియా), అమెరికా. ఉన్నతమైన రెడ్డి డాక్టర్ల కుటుంబం(కెనడా). ఆస్థి విలువ 5కోట్లు. ప్రస్తుత నివాసం కెనడా.

వివరాలకు: కొండూరు హరినారాయణరెడ్డి, 25-9-413, పోస్టల్‌కాలనీ, ఆంధ్రకేసరినగర్, నెల్లూరు - 4.
98480 34522
94406 39460.
పోస్ట్‌బాక్స్ నెం.4, C/o. లాయర్ జాతీయ తెలుగు వారపత్రిక, ప్లాట్ నెం. 1 & 2, మెయిన్‌రోడ్డు, మాగుంట లే-అవుట్, నెల్లూరు - 3.

PDF Compressor Free Version



# గూడూరు డివిజన్ వార్తలు

## సమస్యలను సత్వరం పరిష్కరించండి

### సబ్ కలెక్టర్ నివాస్ వెల్లడి



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న సబ్‌కలెక్టర్

రెవెన్యూ సదస్సుల్లో ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి తక్షణం వాటిని పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ జె.నివాస్ డివిజన్‌లోని మండల తహశీల్దార్లను ఆదేశించారు. ప్రతి సోమవారం డివిజన్ లోని అనేక ప్రాంతాల నుండి తమ సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నా మండల స్థాయిలో అధికారులు పట్టించుకోకుండా కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటున్నారని, మీరైనా సమస్యలను సావధానంగా విని పరిష్కరించాలని ప్రజలు సబ్‌కలెక్టర్‌ను వేడుకొనడంతో ఆయన పైవిధంగా తహశీల్దార్లను ఆదేశించారు. ప్రధానంగా ప్రతి సోమవారం భూసమస్యలు అధికంగా వస్తున్నాయని, వాటి పరిష్కార మార్గాలను అధికారులు తెలుసుకొని గ్రామస్థాయిలోనే వాటిని పరిష్కరించాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ప్రధానంగా శ్మశానం, రహదారులపై అనేక అభ్యంతరాలు, ఆరోపణలు వస్తున్న దృష్ట్యా అధికారులు స్వయంగా వాటిని పరిశీలించి వాటికి శాశ్వత పరిష్కారం చూపెట్టాలన్నారు. తమకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ పలువురు సోమవారం గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఎన్నో ఏళ్లుగా తమ సమస్యలు పరిష్కారంకు నోచుకోవడం లేదని, వెంటనే అర్హులైన తమకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు.

## ఘనంగా అమ్మ ఛారిటబుల్‌ట్రస్ట్ వార్షికోత్సవం



జ్యోతిని వెలిగిస్తున్న పనబాక కృష్ణయ్య

'అమ్మ' ఛారిటబుల్‌ట్రస్టు మొదటి వార్షికోత్సవ కార్యక్రమాన్ని కాంగ్రెస్‌పార్టీ గూడూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పనబాక కృష్ణయ్య 17వ తేదీ జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. గూడూరు డిఎన్‌ఆర్ కమ్యూనిటీ హాలులో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పనబాక కృష్ణయ్య మాట్లాడుతూ గూడూరులో 'అమ్మ' ఛారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పలు ఈవెంట్స్‌ను నిర్వహించడం సంతోషకరమన్నారు. 'అమ్మ' కల్చరల్ ఈవెంట్స్ ద్వారా యువతలోని కళలను వెలికి తీసేందుకు ప్రయత్నిస్తున్న సంస్థ నిర్వాహకుడు శాంతికుమార్‌ను అభినందించారు. అనంతరం పాడుతాతీయగా విజేత ప్రవీణ్‌కుమార్ ప్రార్థనాగీతాన్ని ఆలపించారు. యువతీయువకులు సినీగీతాలకు చేసిన నృత్యాలు ఆహూతులను అలరించాయి. ఈ కార్యక్రమంలో 24సొసైటీ అధ్యక్షుడు ఎల్లా శ్రీనివాసులురెడ్డి, బాబురెడ్డి, ముత్యాలయ్య, వాకా విజయభాస్కరరెడ్డి, మయూరి శ్యామ్‌యాదవ్, కె.మునిగిరీష్, మల్లికార్జునరెడ్డి, వెంకటకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ప్రసాదరెడ్డి, పుచ్చకాయల శ్రీనివాస్ యాదవ్, రామ్మోహన్‌రెడ్డితో పాటు 'అమ్మ' కల్చరల్ ఈవెంట్ ఆర్గనైజర్ శాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## జాతరలో జంతు బలులు వద్దు

### డిఎస్పీ టి.హనుమంతరావు వెల్లడి

చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులో వచ్చే నెలలో జరిగే శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో జంతు బలులు లేకుండా గట్టి చర్యలు తీసుకోవాలని గూడూరు డిఎస్పీ టి.వి.హనుమంతరావు పోలీసులను కోరారు. సోమవారం రాత్రి స్థానిక డిఎస్పీ కార్యాలయంలో ఎస్సై, సిఐలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ గతంలో వెంకటగిరిలో జరిగిన పోలేరమ్మ అమ్మవారి జాతరలో సాధ్యమైనంతవరకు జంతుబలులు జరగకుండా చూడటం జరిగిందని, ప్రస్తుతం కనుపూరులో జరిగే ముత్యాలమ్మ అమ్మవారి జాతరలో కూడా జంతుబలులు జరగకుండా చూడాలని ఆయన పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ ఉప్పాల సత్యనారాయణ, వెంకటగిరి సిఐ శ్రీనివాసులురెడ్డి, చిల్లకూరు ఎస్ఐ దశరథరామయ్యలు పాల్గొన్నారు.

## ఉచిత దంతవైద్యశిబిరం

గూడూరు వాలయానందపురంలోని ఎస్సీ బాలికల వసతిగృహంలో ఆదివారం ఉచిత దంత వైద్యశిబిరాన్ని లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో నారాయణ దంతవైద్యశాల వైద్యులు విద్యార్థినులకు దంత పరీక్షలు నిర్వహించి దంత సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎన్ఎల్ఎన్ ప్రసాద్, సభ్యులు రియాజ్ అహ్మద్, కె.చంద్రశేఖర్, రమణయ్య, సంధ్యారాణిలు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌ను ఒంటిచేత్తో నడిపింది వైయస్సారే

దివంగత నేత వైయస్సార్ రాష్ట్రంలో పాదయాత్ర చేపట్టి ప్రజల సమస్యలను తెలుసుకోవడంతో పాటు అధికారంలోకి వస్తే పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చి 2004 ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీని అధికారంలోకి తీసుకువచ్చారని వైయస్సార్‌సిపీ కేంద్ర కార్యనిర్వాహక మండలి సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి అన్నారు. గూడూరులోని అంబేద్కర్ భవన్‌లో కడింపాటి వెంకటేష్, శశి, అగస్టన్ ఆధ్వర్యంలో ఆదివారం పలువురు యువకులు, మహిళలు వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ 2009ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌పార్టీని ఒంటిచేత్తో అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. దురదృష్టవశాత్తు వైయస్సార్ మృతిచెందాక ఆయన ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ప్రస్తుత కాంగ్రెస్ పాలకులు తూట్లు పొడుస్తున్నారన్నారు. ప్రతిపక్షనేత చంద్రబాబు నాయుడు అధికార పార్టీతో కుమ్మక్కయ్యాడని ఆరోపించారు. అవిశ్వాస తీర్మానం పెట్టక పోవడమే ఇందుకు నిదర్శనమన్నారు. ఇదంతా గమనిస్తున్న ప్రజలు ఎప్పుడు ఎన్నికలు వస్తాయా జగన్‌ను సీఎంను చేద్దామా అని ఎదురుచూస్తున్నారన్నారు. గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త పాశం సునీల్‌కుమార్, మండల కన్వీనర్ మల్లు విజయ కుమార్‌రెడ్డి, నాశిన నాగులు తదితరులు ప్రసంగించారు. అంతకుముందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎం.రాధాకృష్ణారెడ్డి, మధురెడ్డి, మోహన్, కరీముల్లా, మల్లిగాడ్, చిరంజీవి, మాజీ కౌన్సిలర్లు పరుచూరు సుబ్రహ్మణ్యం, బొమ్మిడి శ్రీనివాసులు, తాళ్ళూరు శ్రీనివాసులు, ఎంబేటి చంద్రయ్య, పాల్గొన్నారు.



పార్టీ కండువావేసి మహిళలను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎల్లసిరి గోపాల్‌రెడ్డి

# మూ'వీ'క్షణం

## 'మిస్' కాజల్



'బాద్షా' ఆడియో విడుదలకు కాజల్ హాజరుకాలేకపోయింది. దీనికి కారణం కోయంబత్తూర్‌లో ఆమె ఎక్కాల్సిన ఫ్లైట్ మిస్ అవ్వడమే. ఎయిర్‌పోర్ట్‌కు సరైన సమయానికి చేరుకున్నా స్పైస్ జెట్ సిబ్బంది ఆమెను లోపలకు వంపకపోవడంతో ఫ్లైట్ మిస్ చేసుకుంది ఈ మిస్.

## విభిన్నపాత్రల్లో 'బాద్షా'



యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటించిన బాద్షా ఏప్రిల్ 5న విడుదలకు సిద్ధమౌతుంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ విభిన్న పాత్రల్లో కనిపించనున్నారు. ఇందులో ఓ పాత్రని పూర్తిగా కామెడీ ఎంటర్‌టైన్‌మెంట్ కోసం తీర్చిదిద్దారు. 'బాద్షా' కోసం అభిమానులు ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు.

## మోడ్రన్ శృతి



శృతిహాసన్ తెలుగులో మూడు సినిమాల్లో చేసి బిజీ తారగా మారింది. 'బలుపు' సినిమాలో ఆమె మొదటిసారిగా గ్లామర్ రోల్ పోషిస్తుంది. నా కెరీర్‌ల్లోనే మొదటి సారిగా తెలుగు సినిమాలో జీన్స్ ఫ్యాంట్, మినీస్కర్ట్స్ వేసి ఈ సినిమాలో నటించానని ఆమె ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది.



## మనోహరుడు

శంకర్ తీసిన 'జీన్స్' నుండి 'రోబో' వరకు అన్ని సినిమాలు హాలీవుడ్ స్థాయిని తలపిస్తాయి. దీనికి కారణం ఆయన ప్రతి సినిమాకి హాలీవుడ్ టెక్నీషియన్స్‌ని పెట్టుకోవడమే తాజాగా 'మనోహరుడు' సినిమాకు కూడా ప్రపంచంలో అత్యంత ప్రాముఖ్యమైన విఎఫ్ఎక్స్ స్టూడియోల్లో ఒకటైన దానితో పొత్తు కుదుర్చుకున్నాడు. వేటా స్టూడియో సంస్థాపకుడైన పీటర్ జాక్సన్ 'లార్డ్ఆఫ్ ది రింగ్స్ ట్రయాలజీ', 'కింగ్‌కాంగ్', 'హాబ్బిట్' వంటి సిరీస్‌ను తెరకెక్కించారు. మనోహరుడు సినిమాను వందకోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు.



## ఆశ తీరలేదు

సెన్సేషనల్ మూవీ 'ఈగ' జాతీయ అవార్డుల మోత మోగించింది. ఈ ఏడాది ప్రకటించిన జాతీయ అవార్డులలో తెలుగు సినీ పరిశ్రమకు సంబంధించి 'ఈగ' ఒకటే విజేతగా నిలిచింది. 'ఈగ' సినిమాకు ఉత్తమ చిత్రం ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగాలలో రెండు జాతీయ అవార్డులు లభించాయి. అయితే ఈ అవార్డుల పట్ల 'ఈగ' దర్శకుడు రాజమౌళి సంతోషంగా లేడు. ఈ సినిమాలో విలన్ సుదీప్‌కు అవార్డు వచ్చి వుంటే ఎంతో బాగుండేదని రాజమౌళి తన ట్విట్టర్‌లో పేర్కొన్నారు.

PDF Compressor Free Version





హరివిల్లు లైఫ్‌టైం అచీవ్‌మెంట్ అవార్డును స్వీకరించిన సందర్భంగా మాజీశాసనసభ్యులు జె.కె.రెడ్డి - శ్రీమతి సులోచన దంపతులను వారి నివాసంలో సత్కరించిన బెజవాడ గోపాలరెడ్డి అవార్డు కమిటీ కార్యదర్శి బి.వి.నరసింహం

# ఆర్థిక స్థోమత లేక... ఆరోగ్యశ్రీ లేక...

## పేదరోగికి అండగా నిలిచిన ఏ.సి.స్టేడియం వాకర్స్



మల్లిఖార్జునకు ఆర్థికసాయాన్నందిస్తున్న వాకర్స్

"ఆరోగ్యశ్రీ" ఈ పేరు వింటే పేద రోగులకు పోయిన ప్రాణాలు లేచి వచ్చేలా చేసాడు దివంగత నేత వైయస్ రాజశేఖరరెడ్డి. నయం చేసుకోవడానికి నలుదిక్కులా వెతుక్కోవలసిన పనిలేకుండా, ఖరీదైన వైద్యానికి వెరవకుండా ప్రభుత్వ ఖర్చుతో వైద్యం చేయించుకునే భరోసాగా నిలిచింది ఆరోగ్యశ్రీ. కాని ఆరోగ్యశ్రీ కార్డులేక ఆర్థిక స్థోమత లేకపోతే ఎంత బాధ పడాల్సివస్తుందో నెల్లూరు మైపాడు రోడ్డులోని శ్రీనివాసనగర్‌లో నివసిస్తున్న లారీడ్రైవర్ మల్లిఖార్జున్ ఉదంతం తెలియజేస్తోంది. మల్లికార్జున్ లారీడ్రైవర్‌గా జీవనం సాగిస్తూ దూరప్రయాణాలు చేస్తున్న క్రమంలో ఇటీవల జబ్బున పడ్డాడు కడుపులో పెద్దగడ్డ వుందని వెంటనే శస్త్ర చికిత్స చేయాలని నెల్లూరులోని నారాయణ ఆసుపత్రిలో వైద్యులు సూచించి వైద్యం చేయగా పేగుల్లో ఇన్‌ఫెక్షన్ వుందని తేలింది. ప్రాణాపాయం నుంచి తప్పించుటకు పేగులు శరీరం వెలుపలే వుంచి ఇన్‌ఫెక్షన్ తగ్గించడానికి వారు ప్రయత్నిస్తున్నారు. దీనికి మల్లికార్జున్‌కు వున్న ఆస్తి కరిగిపోయి అప్పుల పాలయ్యారు. వారిది కడు పేద కుటుంబం అయినా ఆరోగ్యశ్రీ కార్డు లేదు. ప్రస్తుతం వైద్యం చేయించుకొనే స్థోమతలేక దాతల సహాయం కోరడంతో స్పందించిన వారు సహాయం చేస్తున్నారు. ఆ క్రమంలో ఈనెల 14న నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ స్పందించి 8,000రూ॥ వితరణ చేసింది. అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్రషెట్టి, కార్యదర్శి ఎస్.బలరామయ్యనాయుడు, డా॥కె.అంకిరెడ్డి, ఏఎల్ నరసింహాచారిలు మల్లికార్జున్ ఇంటికి వెళ్ళి అతనిని పరామర్శించి నగదును అందించారు. అలాగే తెలుగుదేశం పార్టీ నాయకుడు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తదితరులు రూ॥ 12,000 అందించారు. సినీనటులు బాలకృష్ణ ఫోన్‌లో మల్లిఖార్జున్‌ను పరామర్శించారు. ఇంకా దాతలు అందరూ స్పందించి అతని వైద్యానికి సహాయమందించమని "లాయర్" కోరుతోంది.

# అపురూపం.. నెల్లూరీయుల ఆతిథ్యం

### - "గజల్స్" శ్రీనివాస్

సుప్రసిద్ధ గజల్స్ గాయకుడు, 125 భాషల్లో "గజల్స్" వినిపించి మూడు గిన్నీస్ ప్రపంచ రికార్డులను తన స్వంతం చేసుకుని "గజల్స్"ని తన ఇంటి పేరుగా మార్చుకున్న డాక్టర్ కేసిరాజు శ్రీనివాస్ మార్చి 18వతేదీ సోమవారం నెల్లూరొచ్చాడు. మాగుంట పార్వతమ్మ దాతృత్వంతో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహింపబడుతున్న స్పాస్టిక్‌సెంటర్‌ను ఆయన సందర్శించాడు. అక్కడ జరుగుతున్న సేవా కార్యక్రమాలను చూసి నిర్వాహకులను అభినందించాడు. ఈ సందర్భంగా శ్రీనివాస్ తన పాటలు, సందేశాత్మక గీతాలతో మానసిక వికలాంగుల్ని సంతోషపరిచారు. పసిపాప నవ్వితే ఎంత బాగుంటుందో అనే పాట పాడి వినిపించారు. గర్భిణీలకు పౌష్టికాహారలోపం ఏర్పడితే ఇటువంటి మానసిక వికలాంగులు పుట్టే అవకాశం ఉందన్నారు. మధ్యాహ్నం మాగుంట నివాసంలో విందుకు హాజరయ్యాడు. అనంతరం నెల్లూరు నగర మాజీశాసనసభ్యుడు జె.కె.రెడ్డి, కావలి మాజీ శాసనసభ్యురాలు మాగుంట పార్వతమ్మలతో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్‌ని కలెక్టర్ కార్యాలయంలో కలసి స్పాస్టిక్ సెంటర్ నిర్వాహణకు అవసరమైన కొంత నిధులను సమకూర్చుకోవడానికి తనవంతు సహాయాన్ని అందిస్తానని జూలై ఆఖరి వారంలో తనతోపాటు మరికొంత మంది కళాకారులతో వచ్చి నెల్లూరులో ఒక గొప్ప సంగీత కార్యక్రమాన్ని నిర్వహిస్తానని, ఆ కార్యక్రమంలో టిక్కెట్లు, స్పాన్సర్ల ద్వారా వచ్చే మొత్తాన్ని స్పాస్టిక్ సెంటర్‌కు విరాళంగా అందజేయవలసిందిగా కలెక్టర్‌ని కోరాడు. శ్రీనివాస్ అభ్యర్థనకు స్పందించిన కలెక్టర్ తనవంతు సహాయాన్ని తప్పక అందిస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం పార్వతమ్మ, జె.కె.రెడ్డిలతో కలసి పల్లెపాడులోని గాంధీ ఆశ్రమాన్ని శ్రీనివాస్ సందర్శించాడు. పవిత్ర పెన్నానది తీరంలో వున్న గాంధీ ఆశ్రమాన్ని చూస్తేనే మనసు ప్రశాంతంగా మారిందని ఇంతటి గొప్ప ప్రాంతాన్ని



గజల్ శ్రీనివాస్‌కు జ్ఞాపికను అందజేస్తున్న జె.కె.రెడ్డి, శ్రీమతి మాగుంట పార్వతమ్మ

సందర్శించడం తనకు ఎంతో ఆనందంగా వుందన్నాడు. గాంధీజీ స్వయంగా ప్రారంభించిన ఈ ఆశ్రమానికి జాతీయ స్థాయి గుర్తింపు తేవాలని, ఇందుకు తనవంతు సహకారాన్ని అందిస్తానన్నారు. ఇలాంటి ఉన్నతమైన ప్రదేశం గురించి ప్రపంచానికి చాటి చెప్పక పోవడం చారిత్రాక తప్పిదమన్నారు. గాంధీజీపై 115స్వదేశీ, విదేశీ భాషల్లో పాటలు పాడినట్లు తెలిపారు. అక్టోబర్ 2 మహాత్ముని జయంతి సందర్భంగా గాంధేయవాదంపై 500నుంచి 1000 మంది యువకులతో సమ్మేళనం నిర్వహిస్తానన్నారు.

పల్లెపాడు నుండి కావలికి వెళ్ళిన శ్రీనివాస్ అక్కడ "రేంజస్ స్కూల్స్" 4వ వార్షికోత్సవంలో పాల్గొన్నాడు. ప్రతి విద్యార్థి చిన్ననాటి నుండే దేశభక్తిని పెంపొందించుకోవాలని కన్నతల్లిని, పుట్టిన గడ్డని ఎప్పుడికీ మరువకూడదని చెప్పాడు. గౌతమబుద్ధుడిని వేదికపై నుంచి వార్షికోత్సవాన్ని నిర్వహిస్తున్న రేంజస్ స్కూల్స్ యాజమాన్యాన్ని గజల్స్ శ్రీనివాస్‌తో పాటు జె.కె.రెడ్డి, మాగుంట పార్వతమ్మలు అభినందించారు. ఈ సందర్భంగా అమ్మ విలువను తెలిపే "గజల్"ను పాడి శ్రీనివాస్ అక్కడున్న వారందరిని తన్మయత్వానికి గురిచేశాడు. స్కూల్ కరస్పాండెంట్ రాజ్‌కుమార్ చౌదరితో పాటు కావలికి చెందిన పలు వురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



శ్రీనివాస్‌ను సత్కరిస్తున్న రాజ్‌కుమార్ చౌదరి, పార్వతమ్మ

## లాయర్ తో కాసేపు...

నెల్లూరు పర్యటనలో "లాయర్"తో కాసేపు ముచ్చటించాడు "గజల్స్" శ్రీనివాస్. పశ్చిమగోదావరి జిల్లాలోని మోగల్లు గ్రామంలో అల్లూరి సీతారామరాజు నివసించిన ఇల్లు శిథిలావస్థలో వుండడం చూసి మనసు చలించిందని, స్వాతంత్ర పోరాటంలో అశువులు బాసిన ఓ ధీరోదాత్తుడి నివాసాన్ని ఎవరో ఆక్రమించి వుండడం గమనించి హృదయం రోదించిందని, 4లక్షలు చెల్లించి ఆ గృహాన్ని ఆ ఆక్రమణదారుడి నుండి తాను కొనుగోలుచేసి కొంతమంది దాతల సహకారంతో గతంలో అక్కడ వుండిన ఇల్లును యథాతథంగా నిర్మించి, భావితరాల వారికి భారత సంగ్రామోద్యమ స్ఫూర్తిని కలిగించే స్థాయిలో సౌర్యశిల్పారామాన్ని నెలకొల్పి పర్యాటక కేంద్రంగా ఈ ప్రదేశాన్ని తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నానన్నారు. నెల్లూరన్నా, నెల్లూరీయుల ప్రేమాభిమానాలన్నా తనకు చాలా ఇష్టమని, ముఖ్యంగా మాగుంట సుబ్బరామిరెడ్డి, పార్వతమ్మలంటే తనకు ఎనలేని గౌరవమని అన్నారు. తరచూ నెల్లూరుకు వచ్చి నెల్లూరీయుల ఆతిథ్యాన్ని రుచి చూస్తుంటానని అన్నాడు. మంచి పనికోసం ఎప్పుడూ తాను ముందుంటానని చెప్పే "గజల్స్ శ్రీనివాస్"ని అభినందిస్తూ ఆయన భవిష్యత్తులో ఇంకా ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షిస్తోంది "లాయర్".

# నాట్య మయూరీలు... దేవతా సిస్టర్స్



సాంప్రదాయ భరతనాట్య ప్రదర్శనలలో నాట్యమయురీలుగా దూసుకుపోతున్నారు దేవతాసిస్టర్స్. పసికూనలైన తనుశ్రీ(9) రుషిక(7) నిరంతర సాధనతో భరతనాట్యమే ఊపిరిగా ముందుకు సాగుతున్నారు. ఈ చిన్నారులు. నెల్లూరు నగరం జొన్నలగడ్డ వారివీథిలో ఉంటున్న తనుశ్రీ, రుషిక నాట్యంపై ఎనలేని మక్కువ పెంచుకొని ఇంట్లో పాటల క్యాసెట్టును పెట్టుకొని వారే వచ్చిరాని డాన్సులు చేస్తూ, టీవీల్లో వచ్చే, జానపద, సాంప్రదాయ తదితర నాట్యాలను చూసి చేస్తు వుండడంతో తల్లిదండ్రులు దేవత దివాకర్, సువర్ణపుష్ప వారిరువుర్ని శ్రీ గురుకృపా కళాక్షేత్రం అధినేత్రి సురభిగాయత్రి వద్ద శిక్షణలో ఉంచారు. భరతనాట్యంలో శిక్షణ పొందుతూనే, గోమతి గ్లోబల్ స్కూలులో చదువులోను ప్రథమంగా నిలిచారు. తనుశ్రీ 5వతరగతి, రుషిక 3వతరగతి చదువుతున్నారు. జిల్లాలోనూ, నగరంలోనూ అనేక ప్రదర్శనలు ఇచ్చి అందరి ప్రశంసలను అందుకున్నారు.

### ఈ చిన్నారులు అందుకున్న అవార్డులు

విశాఖపట్నంలో "ఆంధ్రబాలరత్న" అవార్డును, పరిమళ ఇన్‌స్టిట్యూట్ వారు "నర్తనబాల" అవార్డును బహుకరించారు. డాన్స్‌డాన్స్ రాష్ట్రస్థాయి పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించారు. హైదరాబాద్‌లో సిలికానాంధ్ర వారు నిర్వహించిన కూచిపూడి నాట్య సమ్మేళనంలో పాల్గొని గిన్నిస్ రికార్డుకు ఎంపికయ్యారు. ప్రభుత్వం వివిధ రంగాల్లోని కళాకారులను సత్కరించే కార్యక్రమంలో బహురూప అవార్డును అందుకున్నారు. ఇంతే కాకుండా, విజయవాడ శ్రీ కనకదుర్గమ్మ దేవాలయం, తిరుపతి మహతి ఆడిటోరియంలో అన్నమయ్య జయంతి ఉత్సవాల్లో, మంత్రాలయం శ్రీ రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో, శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, శ్రీ రంగనాథస్వామి దేవస్థానం, ఎ.పి.టూరిజం వారు కస్తూరిభా కళాక్షేత్రంలో భరతనాట్య ప్రదర్శనలు ఇచ్చి కరతాళధ్వనులు అందుకున్నారు. అంజనీ డ్యాన్స్ ఇన్‌స్టిట్యూట్ వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొని సినీనటి కళాభినేత్రి వాణిశ్రీ చేతులమీదుగా ప్రథమ బహుమతిని అందుకున్నారు. కళాజ్యోతి మిమిక్రీ అసోసియేషన్ వారు నిర్వహించిన పోటీల్లో పాల్గొని సినీ హాస్యనటులు పద్మనాభం చేతులమీదుగా బహుమతులు అందుకున్నారు. కళాంజలి సంస్థ నిర్వహించిన పోటీల్లో పాల్గొని సినీ కొరియోగ్రాఫర్ శివశంకర్ మాస్టర్ చేతులమీదుగా బహుమతులు తీసుకున్నారు.

జర్నలిస్టుల అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర మహాసభలో భరతనాట్యం ప్రదర్శించి రాష్ట్రమంత్రి డికె అరుణ చేతుల మీదుగా బహుమతులు స్వీకరించారు. నేతాజీ ఫౌండేషన్, కేతాఅంకుల్, తిక్కన



కవి పీఠం, పలు కళాసంస్థలు నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రథమ, ద్వితీయ, బహుమతులు అందుకున్నారు. రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ఆనం వివేకానందరెడ్డి, జిల్లా కలెక్టర్ బి.శ్రీధర్, జిల్లా ఎస్పీ బివి రమణకుమార్, బీజేపీ జాతీయనాయకుడు ముప్పవరపు వెంకయ్య నాయుడు, నగర ఎమ్మెల్యే ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి, నటులు రాజ్‌కుమార్‌ల వద్ద అనేక బహుమతులు అందుకున్నారు.

ఇప్పటి వరకు దాదాపు 250 ప్రదర్శనలు ఇచ్చిన ఈ దేవత సిస్టర్స్ భవిష్యత్‌లో మంచి కళాకారిణులుగా ఎదగాలని దీవిద్దాం.

# రూపుమారుతున్న నెల్లూరు!



నెల్లూరు నగరం కొత్త రూపాన్ని, సరికొత్త అందాన్ని సంతరించుకుంటుంది. ఆర్థికమంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి తనకు అందివచ్చిన అవకాశంతో నెల్లూరు అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తున్నాడు. నెల్లూరునగరంలో జీఎన్‌టీ రోడ్డు మీదుగా పోతూ ఆర్ అండ్ బి గెస్ట్‌హౌస్ దాటామంటే పాత నెల్లూరు ఆనవాళ్లు కనిపించడం లేదు. సరికొత్త నెల్లూరును మనం అక్కడ చూస్తున్నాం. అయ్యప్పగుడి నుండి శరవేగంగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులతో నెల్లూరు నగరం ఇంత విశాలంగా వుందా అనిపిస్తుంది. ఆత్మకూరు బస్టాండ్ నుండి దాదాపు బొల్లినేని ఆసుపత్రి దాకా రోడ్డును ఎటూ విస్తరించే పరిస్థితి లేదు. నిర్మాణాలు అంతగా చొచ్చుకొచ్చాయి. కాని టీటీడి కల్యాణమండపం నుండి జీఎన్‌టీ రోడ్డు బైపాస్‌లో కలిసేంత వరకు కావాల్సినంత రోడ్డు స్థలం వుంది. మంత్రి ఆనం చొరవ, ఎమ్మెల్యేలు ఆనం వివేకా, ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డిల కృషి ఫలితంగా ఈ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు కావడం, పనులు చకచకా జరుగుతుండడం శుభపరిణామం.

ఇక పెద్దాసుపత్రి రూపురేఖలే మారిపోతున్నాయి. ఇక్కడ నిర్మించనున్న వైద్యశాలతో ఈ ప్రాంతం దశ, దిశ మారి మహర్దశ పట్టనుంది. ప్రభుత్వ వైద్య కళాశాల దెబ్బకు పెద్దాసుపత్రి ప్రాంతంలో స్థలాల రేట్లు, అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ల ధరలు ఒక్కసారిగా పెరగడం మొదలుపెట్టాయి.

ఇక్కడే ఎదురుగా వున్న ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియం కూడా కొత్తహంగులు దిద్దుకోనుంది. స్టేడియంలో వున్న పాత నిర్మాణాలను తొలగించి 3కోట్లతో స్టేడియం అభివృద్ధి పనులను చేపట్టడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.

రాజీవ్‌మార్గ్(మినీబైపాస్)ను ఆరు లైన్లుగా మార్చనున్నారు. సంతపేట నుండి అంబాపురం వరకు నాలుగులైన్ల రోడ్డు మంజూరైంది. ఇరుకళలమ్మ గుడి నుండి దొడ్ల డెయిరీ వరకు నాలుగు లైన్ల రోడ్డుకు నిధులు మంజూరు చేయడమే కాదు టెండర్ కూడా ఖరారైంది. సీఎం వస్తే ఆయన చేతులమీదుగా ఈ పనులను మొదలుపెట్టించాలని అధికారులు ఎదురు చూస్తున్నారు.

నెల్లూరు నగరం ఎప్పటికీ ఇలా వుండిపోవాల్సిందేనా... ఈ ఇరుకు సందులు, మురికి సందులు శాశ్వతంగా మన ఆస్తులేనా అని మొన్నటిదాకా ఆవేదన చెందాం... కొంతలో కొంత మార్పు తీసుకొస్తున్నందుకు సంతోషం.

# మొదలైన పది పరీక్షలు

జిల్లా కేంద్రంలో ఈనెల 22 నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు మొదలయ్యాయి. జిల్లాలోని 171కేంద్రాలలో ఉదయం 9.30గంటల నుంచి 12గంటల వరకు పరీక్షలు జరుగుతున్నాయి. 33,875 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. వీరిలో రెగ్యులర్ విద్యార్థులు 31,334 మంది, ప్రైవేటు విద్యార్థులు 2,545 మంది ఉన్నారు. తెలుగు మీడియం 16,642 మంది, ఇంగ్లీషుమీడియం 14,692 మంది పరీక్షలు రాస్తున్నారు. రెగ్యులర్ విద్యార్థులకు 153 పరీక్షాకేంద్రాలు, ప్రైవేటు విద్యార్థులకు 18పరీక్షకేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో 27సీ సెంటర్లు ఏర్పాటు చేశారు. 171మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 171మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 2098 మంది ఇన్విజిలేటర్లు, 10ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, 24 సిట్టింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలులో వుంటుంది. కేంద్రాల చుట్టుప్రక్కల జెరాక్స్ షాపులు మూసి వుంచారు. పరీక్షా కేంద్రంలోకి మొబైళ్ళను నిషేధించారు. ఇన్విజిలేటర్లు కూడా ఫోన్స్ స్విచ్ఛాఫ్ చేసి, ఛీఫ్ సూపరింటెండెంట్లు వద్ద అప్పగించారు. విద్యార్థులకు బస్‌పాస్‌లు యథాప్రకారం కేంద్రం వరకు చెల్లుబాటు అవుతున్నాయి. టెన్త్ విద్యార్థులు హాల్‌టిక్కెట్లు చూపిస్తే ఛార్జీలలో రాయితీ ఇస్తున్నారు. పరీక్షల్లో ఏదైనా సమస్యలు తెలుపడానికి డిఇఓ కార్యాలయంలో అధికారులు ప్రత్యేకంగా కంట్రోలురూం ఏర్పాటుచేశారు. 46మంది వికలాంగ విద్యార్థులు ఈసారి పరీక్షలు రాస్తున్నారు. వీరికోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసారు.


## ఉత్తరక్రియలు



జననం: 09.12.1960 మరణం: 18.03.2013

మాకు మార్గదర్శకులు, మా ఇంటి దైవం

**డా॥ వి.యస్.రెడ్డి గారు**

తేది. 18.03.13న స్వర్గస్తులైనారు.

వారి పవిత్రాత్మకు శాంతిని చేకూర్చాలని భగవంతుని ప్రార్థిస్తూ...


భార్య: డా॥ వి.ఇందిర, రేడియాలజిస్టు
ఇందిరా స్కానింగ్ సెంటర్, నెల్లూరు.

కుమారుడు: వి.శ్రీచంద్‌రెడ్డి

కుమార్తె: వి.కీర్తన

ఉత్తరక్రియలు: 28-03-13 గురువారం నెల్లూరు విజయమహల్‌గేటు వద్దగల మా స్వగృహమునందు జరుగును. కావున తెలియజేయడమైనది.


# విశేషరీతిలో... విశాఖ తీరంలో...
# "కళాబంధు" శివార్చన





శివలింగాన్ని అభిషేకిస్తున్న శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్రస్వామి, సుబ్బరామిరెడ్డి

"ఓం నమశ్శివాయ, శంభో శంకర, హరహర మహాదేవ, ఓం నమశ్శివాయ..." - కళాబంధు శివనామస్మరణతో విశాఖపట్టణంలోని ఆర్‌కె బీచ్ మిన్ను మన్నును ఏకం చేసే, సముద్ర అలల ఘోషను అధిగమించే ఆధ్యాత్మిక నాదమైంది. ప్రతి ఏటా శివరాత్రికి ఆ మహాదేవుని ప్రియభక్తులు, కళాపోషకులు, పార్లమెంటుసభ్యులు టి.సుబ్బరామిరెడ్డి విశాఖపట్టణంలో కనీవినీ ఎరుగని రీతిలో వైవిధ్యంగా నిర్వహించే శివార్చన ఈ సంవత్సరం విశాఖవాసుల్నే కాక ఆ భక్తిమయ కార్యక్రమాన్ని తిలకించిన రాష్ట్ర, రాష్ట్రేతర ప్రముఖులందర్నీ ఆనంద పరవశుల్ని చేసింది. ఉదయం 8.45 గంటలకు సుబ్బరామిరెడ్డి కోటి ఎనిమిది లక్షల శివలంగాలకు వేదపండితుల స్వచ్ఛమైన మంత్రోచ్ఛారణతో చేసిన కుంభాభిషేకం, రుద్రాభిషేకం వీక్షించిన ప్రతిఒక్కరు అలౌకిక ఆధ్యాత్మిక ఆనందంతో తన్మయులయ్యారు. ఆ శివలింగాలపై నుంచి కిందికి పడే అభిషేకజలాన్ని భక్తులు శిరసులపై జల్లుకుని పరమానందభరితులయ్యారు.

ఈ సందర్భంగా కళాబంధు టి.సుబ్బరామిరెడ్డి మాట్లాడుతూ విశాఖవాసుల సౌభాగ్యానికే ఈ తరహా కార్యక్రమాలు ఏటా కొనసాగిస్తున్నానని అన్నారు. తాను పేదల పక్షపాతినంటూ పేదప్రజల సంక్షేమం కోసం సేవాపీఠ కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. పేదలు, వికలాంగులు, రోగుల సంక్షేమం కోసం వివిధ సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. మతాలకు అతీతంగా శిథిలమైన ఆలయాలు, మసీదులు, చర్చిల నిర్మాణాలకు, పునరుద్ధరణకు ఆర్థికసాయం చేస్తున్నానన్నారు. తన ఆఖరి శ్వాసవరకు ప్రజాసేవ చేస్తానని ఆయన పేర్కొన్నారు. ప్రజలు సుఖశాంతులతో వుండాలన్న ఆకాంక్షతోనే ఎంతో ఉదాత్తమైన ఆధ్యాత్మిక కార్యక్రమాలు చేపడుతున్నానన్నారు.



'విశ్వవిఖ్యాత దర్శక మహర్షి' బిరుదును రమణీయ చిత్రకారుడు బాపు తరపున ఆయన కుమారుడు వెంకటరమణకు ప్రదానం చేస్తున్న కళాతపస్వి కె.విశ్వనాథ్, టి.సుబ్బరామిరెడ్డి, మోహన్‌బాబు, ఉండవల్లి, బ్రహ్మానందం, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ తదితరులు

ఈ సందర్భంగా సినీ సంగీత దర్శకులు సాలూరి వాసూరావు బృందం ఆలపించిన భక్తిగీతాలు, 34మంది నృత్యకళాకారులు ప్రదర్శించిన "దక్షయజ్ఞం", అఘోరాల శివార్చన నృత్యం, గంగావతరణం తదితర కార్యక్రమాలు అందరినీ అలరించాయి. తదుపరి టి.సుబ్బరామిరెడ్డి లలిత కళాపరిషత్ ఆధ్వర్యంలో ఆ వేదికపై ప్రముఖ చిత్రకారులు, చలనచిత్ర దర్శకులు డాక్టర్ బాపును 'విశ్వవిఖ్యాత దర్శక మహర్షి' బిరుదుతో సత్కరించదలచగా, బాపు అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడం వల్ల ఆయన కుమారుడు వెంకటరమణ సుప్రసిద్ధ సినీదర్శకులు కళాతపస్వి కె.విశ్వనాథ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు ఉండవల్లి అరుణకుమార్, యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, ప్రభుత్వ విప్ ద్రోణంరాజు శ్రీనివాస్, శాసనసభ్యులు తైనాల విజయకుమార్, యు.వి.రమణమూర్తిరాజు, గొల్ల బాబూరావు, చింతలపూడి వెంకటరామయ్య, మళ్ళ విజయప్రసాద్, మాజీఎమ్మెల్యే కర్రి సీతారామ్, దూరదర్శన్ సంచాలకులు శైలజాసుమన్, సినీనటులు మోహన్‌బాబు, బ్రహ్మానందం, హీరోయిన్ పూనమ్, అలనాటి ప్రఖ్యాతనటీమణి వాణిశ్రీ, వాటా అధ్యక్షుడు వరదారెడ్డి, స్టీల్‌ప్లాంట్ ఐఎన్‌టియూసీ ప్రతినిధి ఎం.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Published, Printed & owned by THUNGA SIVAPRABHATH REDDY, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at Roopa Graphics, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-THUNGA SIVAPRABHATH REDDY, Executive Editor-G.SREENIVASULU REDDY.

PDF Compressor Free Version